RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 344 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 జనవరి 2025 శనివారం పేజీలు : 4

## దాడుల వెనక ఐఎస్?

న్యూయార్క్ : ట్రంప్ సర్కారు కొలువుదీరే వేళ.. ప్రజలంతా కొత్త సంవత్సరం వేడుకల్లో మునిగి ఉండగా.. అమెరికాలో ఉగ్రవాద ఘటనలు కలకలం రేపుతున్నాయి. వరుస ఘటనలతో అమెరికన్లు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున న్యూ ఆర్లిన్స్‌లో.. ఐఎస్ ఉగ్రవాద సంస్థ నుంచి ప్రేరణ పొందిన మాజీ సైనికుడు షంషుద్దీన్ జబ్బార్ ట్రక్కుతో దాడి చేసి 15 మందిని పొట్టనబెట్టుకోగా.. లాస్ వెగాసలోని ట్రంప్ హెూటల్ సమీపంలో కారు బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెంద గా.. న్యూయార్క్ క్వీన్స్‌కౌంటీలో.. అమజురా నైట్‌క్లబ్‌లో కాల్పుల ఘటన నమోదైంది. ఇక్కడ 11 మందికి గాయాలయ్యాయి. న్యూ ఆర్లిన్స్ ఘటనలో నిందితుడిని షంషుద్దీన్ జబ్బార్(42)గా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ‌బీఐ) అధికారులు గుర్తించారు.




# నేడు తెలంగాణ కేబినెట్

## రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళపై కీలక నిర్ణయాలు!

## అన్ని శాఖల్లోని పెండింగ్ అంశాలపై చర్చకు ఆస్కారం!!

హైదరాబాద్ : ఈనెల 4న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులకు సమాచారం అందించారు. అవసరమైన సమాచారం సిద్ధం చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై క్యాబినెట్ చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది.తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పంట పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. సంక్రాంతి నుంచి ఈ పథకం అమలు చేస్తామని అసెంబ్లీ సమావేశాల్లో వెల్లడించింది. ఈ మేరకు అర్హుల ఎంపిక, విధివిధానాల ఖరారు కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షణ కేబినెట్ సబ్ కమిటీ కూడా ఏర్పాటు చేసింది. రెండ్రోజుల క్రితం సమావేశమైన కేబినెట్ సబ్ కమిటీ అర్హుల ఎంపికై కసరత్తు చేసింది. ఈ మేరకు ఈనెల 4న జరిగే కేబినెట్ భేటీలో చర్చించి రైతు భరోసా పథకం అమలుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. అనంతరం రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 15 వేలు జమ చేసేందుకు నిధులు విడుదల చేయనున్నారు.ఇక కొత్త రేషన్ కార్డులు కూడా మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రజా పాలన దరఖాస్తుల ద్వారా వచ్చిన అప్లికేషన్లు ఫిల్టర్ చేసి అర్హులైన వారికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. దాదాపు 30-40 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డులపైనా కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఇదే కాకుండా రైతు కూలీలకు ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 12 వేలు ఇస్తామని ప్రకటించింది.డిసెంబర్ 28నే పథకం ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించినా.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో ఆ కార్యక్రమం వాయిదా పడింది. జనవరి నాలుగున జరిగే కేబినెట్ భేటీలో ఈ అంశంపైనా చర్చించి రైతు కూలీల అకౌంట్లలో డబ్బులు జమ చేసే అంశంపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఇదే కాకుండా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక కమిషన్ నివేదిక, పలు పురపాలక సంఘాల్లో గ్రామాల విలీనం, ఎస్సీ వర్గీకరణ, నూతన టూరిజం పాలసీ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు, గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణలో భాగంగా గ్రామ స్థాయి అధికారుల నియామక ప్రక్రియ, అన్ని శాఖల్లో ఉన్న ఇతర పెండింగ్ అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉంది.

## రైతు భరోసా ఎవరికి ఇస్తారో స్పష్టంగా చెప్పాలి

హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు పంపిణీలో రూ. 22 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేతలు.. ఆ డబ్బు ఎక్కడికి వెళ్లిందో చెప్పాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. పత్తి, కంది, చెరకుకు రెండో పంట ఉండదని.. అయినా రైతుబంధు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.




"కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 26,500 కోట్లు ఎగ్గొట్టింది. రైతుబంధు పేరిట ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రైతును రాజును చేస్తామని ఎన్నికల ముందు చెప్పారు.

రైతు డిక్లరేషన్ పేరుతో చాలా హామీలు ఇచ్చారు. ప్రజా పాలనలో 1.6 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. రైతు శాసించాలని కేసీఆర్ అంటే.. యాచించాలని కాంగ్రెస్ అంటోంది. వానాకాలంలో ఎగ్గొట్టిన రైతుబంధు కూడా ఇవ్వాల్సిందే. రైతు రుణమాఫీ చేశామని చెబుతున్నారు.. గ్రామాల వారీగా రుణమాఫీ జాబితాలు పెట్టాలి. రైతు భరోసా ఎవరికి ఇస్తారో స్పష్టంగా చెప్పాలి" అని కేటీఆర్ అన్నారు.

## ఏఐ, డీప్ టెక్నాలజీని తెలుగువాళ్లు అందిపుచ్చుకోవాలి: సీఎం చంద్రబాబు




హైదరాబాద్: నాలెడ్జ్ ఎకానమీలో తెలుగువారు మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఏఐ, డీప్ టెక్నాలజీని తెలుగువాళ్లు అందిపుచ్చుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహాసభలను చంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలిసారి ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. "అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకు..శ్రీకాకుళం నుంచి పాలమూరు వరకు ఎక్కడ ఉన్నా తెలుగువారంతా ఒక్కటే.. అదే తెలుగుజాతి. తెలంగాణ, ఏపీ, ఆస్ట్రేలియా, అమెరికా.. ప్రపంచ నలుమూలల నుంచి ఇక్కడకు వచ్చారు. వివిధ దేశాల సమాఖ్యల అధ్యక్షులు ఇక్కడకు వచ్చారు. నా జీవితంలో ఇది ఎంతో సంతోషకరమైన రోజు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నాం. తెలుగు భాష, సంప్రదాయాలు, సంస్కృతిపై ఇష్టం, గౌరవంతో ప్రపంచ నలుమూలల నుంచి ఈ కార్యక్రమానికి వచ్చారు. నిజం చెప్పాలంటే.. ఏపీ, తెలంగాణలో ఉండే తెలుగువారికంటే భాష, సంప్రదాయాలను కాపాడేది విదేశాల్లో ఉండే తెలుగువారే"

**తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టాలి..** "ఏం చేయాలన్నా ఒక దూరదృష్టి ఉండాలి. ఒక నిర్దుష్టమైన ఆలోచన ఉండాలి. భవిష్యత్‌లో జరగబోయే విషయాలను మనం ముందుగానే ఆలోచించాలి. తగిన విధంగా ముందుకు వెళ్లగలిగితే ఏదైనా సాధ్యమే. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ. 25 సంవత్సరాల్లో ఇది సాధ్యమైంది. తెలుగువారు ఎక్కడున్నా రాణిస్తున్నారు. 1996లో ఐటీకి ప్రాధాన్యత ఇచ్చాను. ఐటీ తిండి పెడుతుందా అని అప్పట్లో ఎంతో మంది హేళన చేశారు. సెల్‌ఫోన్లు ప్రమోట్ చేస్తే.. ఏమన్నా ఉపయోగమా? అని ప్రశ్నించారు.

కానీ ఈరోజు నాలెడ్జ్ ఎకానమీలో తెలుగువారు దూసుకెళ్తున్నారు. ఐటీలో రాణిస్తున్నవారు తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టాలి. ఆనాడు తెదేపా ప్రభుత్వం వేసిన పునాది కారణంగానే ఇక్కడ ఆదాయం పెరిగింది. చదువు, సంపద, జనాభాకు అవినాభావ సంబంధం ఉంటుంది. కొన్ని దేశాల్లో జనాభా రేటు తగ్గిపోతోంది. జపాన్, జర్మనీ దేశాలు భారతీయుల వైపు చూస్తున్నాయి"

**ఐక్యంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలి...** "దేశ విదేశాల్లో తెలుగువారు గొప్పగా రాణిస్తున్నారు. తెలుగువారు ఎక్కడున్నా పరస్పరం సహకరించుకోవాలి. ఐక్యంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలి. ఏ ఏ రంగాల్లో అవకాశాలు ఉన్నాయో తెలుగువారికి బాగా తెలుసు. విజన్ 2047తో ముందుకెళ్తున్నాం. 2047 నాటికి మనం ప్రపంచంలోనే మొదటి, రెండో స్థానంలో ఉంటాం.

చిన్న ఆలోచనతో అనేక మంది తెలుగువారు కోటీశ్వరులు అయ్యారు. చిన్న ఆలోచనతో ర్యాపిడోను స్థాపించి గొప్పగా రాణించారు. కో-వర్కింగ్ స్పేస్ ద్వారా వేలమందికి ఉపాధి కల్పిస్తున్నారు. వినూత్నంగా ఆలోచిస్తే మరింత రాణిస్తారు. జీరో పావర్టీ మన లక్ష్యం కావాలి. 90 దేశాలకు కరోనా వ్యాక్సిన్ అందించిన ఘనత మనది. టాప్-10లో ఉన్న తెలుగు పారిశ్రామికవేత్తలు ఇతరులకు మెంటార్‌గా ఉండాలి. ఎక్కడున్నా.. ఎలా ఉన్నా.. పుట్టిన రాష్ట్రాన్ని మర్చిపోవద్దు. ఇప్పుడు చేయాల్సింది హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్. టెక్నాలజీని సరిగా వినియోగించుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చు. తెలుగు వారికి గౌరవం తెచ్చిన నాయకుడు ఎన్టీఆర్. తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి ఎంతో సేవ చేశారు. తెలుగు భాష వికాసానికి రామోజీరావు ఎంతో కృషి చేశారు" అని చంద్రబాబు అన్నారు.

**దాదాపు 30 ఏళ్లకు మళ్లీ హైదరాబాద్‌లో..** ప్రపంచ తెలుగు సమాఖ్యకు 1993లో శ్రీకారం చుట్టారు. తొలి మహాసభలు 1996లో హైదరాబాద్‌లో జరిగాయి.

దాదాపు 30 ఏళ్లకు మళ్లీ ఇప్పుడు రెండోసారి నగరంలో నిర్వహిస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించారు. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై, దిల్లీ, సింగపూర్, దుబాయ్, మలేసియాలలో మహాసభలు జరిగాయి.




# తెలంగాణ వాసులకు గుడ్ న్యూస్

# నిజమైన సంక్రాంతి ఈ ఏడాది..

## ఫుల్ జోష్ మీదున్న రేవంత్ సర్కార్!!

హైదరాబాద్ : తెలంగాణ ప్రజలకు నిజమైన సంక్రాంతి ఈ ఏడాది జరగనుంది. సంక్రాంతి పండగకు రెండు పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయనుంది. రైతుల ఖాతాల్లో నగదును జమ చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించనుంది. ఒకే పండగకు రెండు పథకాలను అమలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సిద్ధమవుతుంది. ఇందిరమ్మ ఇళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు. సంక్రాంతి నాటికి ఇళ్లను లబ్దిదారులకు మంజూరు చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉంది. కొత్త ఇంటి నిర్మాణం కోసం ఎప్పటి నుంచో వేచి చూస్తున్న లబ్దిదారులకు మాత్రం ఇది తీపి వార్త అనే చెప్పాలి.

**ఇందిరమ్మఇళ్లను...** ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆరు గ్యారెంటీలు ప్రకటించింది. ఈ గ్యారంటీల లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్లను సంక్రాంతి నాటికి మంజూరుచేయాలని నిర్ణయించింది. తొలి విడతలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా సొంత స్థలం ఉన్న వారి ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తూ ఆదేశాలను జారీ చేస్తుంది. వారికి ఇళ్లు నిర్మించుకోవడం కోసం ఐదు లక్షల రూపాయలు దశల వారీగా ఇవ్వనుంది. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే యాప్ లను కూడా సిద్ధం చేసింది. యాప్ ద్వారా తాము దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. స్థలంలేనిపేదలకు మాత్రం రెండో విడతలో ఇళ్లను మంజూరు చేస్తారు. వారికి స్థలంతో పాటు ఐదు లక్షల రూపాయలు ఇవ్వనున్నారు.

**రైతుభరోసా నిధులు...** ఇక రైతు భరోసా నిధులను కూడా సంక్రాంతికి విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఎకరానికి 7,500 రూపాయల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం సిద్ధమయింది. రైతు భరోసా కింద తొలి విడత నిధులను జమ చేయాలని, ఇందుకోసం విధివిధానాలను కూడా నిర్ణయించింది. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద అర్హులైన వారందరికీ ఈ పథకం వర్తించేలా తొలుత నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే పది ఎకరాల్లోపు ఉన్న వారికి మాత్రమే నిధులను అందచేస్తారు. ఆదాయపు పన్ను చెల్లించే వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం ఈ పథకం వర్తించదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఇప్పటికే రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ప్రభుత్వం రైతు భరోసా నిధులను కూడా జమ చేయాలని నిర్ణయించింది. సో.. ఒకే పండగకు రెండు గుడ్ న్యూస్ లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందించబోతుంది.

# సంపాదకీయం

## ఆకలి కేకల దేశంలో.. ప్రాణాలకు 'బిక్ష'

ఒకప్పుడు బ్రిటిష్ పరిపాలనలో పూర్తిగా నలిగిపోయిన నల్ల వారి దేశం అది.. గొప్ప స్వాతంత్ర్య పోరాటంతో బానిస సంకెళ్లు తెంచుకున్న దేశం అది.. కానీ, ఏ స్వాతంత్ర్యం అయితే తీసుకొచ్చాడో ఆ వీరుడే నియంతగా మారాడు.. తన ఆర్థిక విధానాలతో దేశాన్ని వెనక్కు నడిపించాడు. ఇది దేశంలో ఆకలి కేకలకు దారితీసింది. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. కరెన్సీ విలువ పడిపోయింది. ఎంతగా అంటే.. డబ్బులను కట్టలుకట్టలుగా పోసి రొట్టె ముక్క కొనుగోలు చేసేంత. ఆహారం దొరక్క ఏనుగులను చంపుకొని తినేంత. క్రికెట్ అభిమానులకు జింబాబ్వే దేశం బాగా పరిచయమే. ఒకప్పుడు భారత్ కు సవాలు కూడా విసిరిన జట్టు అది. అంతెందుకు..? మొన్నటి టి20 ప్రపంచ కప్ గెలుపు అనంతరం భారత జట్టు వెళ్లిన టూర్ జింబాబ్వేనే. కానీ, ఆ దేశ జట్టు ప్రస్తుతం వెనుకటి అంత బలంగా ఏమీ లేదు. ఓ సాధారణ జట్టుగా మారిపోయింది. ఇక పైన చెప్పుకొన్న నియంత జింబాబ్వే మాజీ అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో రొడీషియాగా ఉన్న జింబాబ్వే ఆ తర్వాత పేరు మార్చుకుంది. కాగా, బ్రిటిష్ పాలనపై ముగాబే 1960ల నుంచి గెరిల్లా విముక్తి పోరాటం సాగించారు. 1980లో స్వాతంత్ర్యం సాధించారు. ఆ వెంటనే ఆయన ప్రధానిగా ఎన్నికయ్యారు. తర్వాత అధ్యక్షుడు కూడా అయ్యారు. 2017 వరకు ఈయన దేశాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఆఫ్రికా ఖండంలో బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన జింబాబ్వే ముగాబే పాలనలో 1990లలో క్షీణ దశలోకి ప్రవేశించింది. కాగా, 2013లో ముగాబే 89 ఏళ్ల వయసులో ఏడోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2017 వరకు ఆయన పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆయనకు వందేళ్లు. ముగాబే హయాంలో చేపట్టిన భూ సంస్కరణలు చివరకు మిశ్రమ ఫలితాలను ఇచ్చాయి. దేశ జనాభాలో ఒక శాతమే ఉన్న తెల్లవారి దగ్గర భూమి అపారంగా ఉండడంతో ఆయన సంస్కరణలు చేపట్టి నల్లవారికి పంచారు. కానీ, ఇందులో అనేక లోపాలు చోటుచేసుకున్నాయి. జింబాబ్వే అధ్యక్షుడిగా ప్రస్తుతం ఎమర్సన్ నంగాగ్వా ఉన్నారు. ఆయన తాజాగా మరణ శిక్ష రద్దు నిర్ణయంపై సంతకం చేశారు. ఇప్పటికే దేశంలో 60 మందికి మరణ శిక్ష పడగా..అది జీవిత ఖైదుగా మారనుంది. జింబాబ్వేలో ముగాబే హయాంలో.. 2005లో మరణ శిక్ష రద్దుపై చర్చ మొదలైంది. సరిగ్గా అది 20 ఏళ్ల తర్వాత సాకారమైంది. నిరసనలు వ్యక్తం అవుతున్నా జింబాబ్వే కోర్టులు మరణ శిక్ష విధిస్తున్నాయి. ఇప్పుడు ఆ శిక్ష రద్దయింది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు

శామీర్ పేట, (గరుడ వార్త) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ కు చెందిన మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మెట్రో రైలుని జేబీఎస్ నుంచి శామీర్ పేట వరకు పొడిగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కలిసి నూతన సంవత్స రం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వలందాస్ మురళి గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు పెండం లక్ష్మినారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిసెనీ హరికృష్ణ, టి జగదీశ్ గౌడ్ పాల్గొన్నారు.





## టీఎస్ యుటిఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ




శామీర్ పేట, (గరుడ వార్త) : టీఎస్ యుటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఇరు మండలాల ఎంఈఓ లు ఆవిష్కరించారు. శుక్రవారం శామీర్ పేటలోని ఎంఈఓ కార్యాలయం వద్ద శామీర్ పేట మండలం ఎంఈఓ వసంత కుమారి, మూడు చింతలపల్లి మండలం ఎంఈఓ భాగ్యమని లు టీఎస్ యుటిఎఫ్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దేవిజా నాయక్, శామీర్ పేట మండల అధ్యక్షుడు పి. తిరుమలేష్, మండల ప్రధాన కార్యదర్శి యు కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కంది.. కాలం కలిసొచ్చింది!

తాండూరు: పప్పుధాన్యాల్లో 'పోషకాల గని'గా పేరున్న కంది పంట సాగు జిల్లాలో ఈసారి ఆశాజనకంగా ఉంది. డిసెంబరు చివరి నుంచి చేతికి అందే దిగుబడులపై రైతులు ఆశలు పెంచుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పత్తి, పెసలు, మినుములు, మక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయి. నామమాత్ర దిగుబడులే చేతికి అందాయి. ఈనేపథ్యంలో సాగులో ఆరోగ్యంగా ఉన్న కందుల నుంచి ఆర్థిక లబ్ధి పొందుతామనే విశ్వాసంతో ఉన్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం క్వింటాలు కందులకు నిర్ణయించిన మద్దతు ధరకంటే ఈసారి ఎక్కువ ధరను ప్రకటించింది.

**అనుకూలించిన వర్షాలు**

సాగులో ఉన్న కంది పంటకు వర్షాలు అనుకూలించాయి. ఏటా సెప్టెంబరు, అక్టోబరులో వర్షాభావ పరిస్థితుల కారణంగా చెల్కభూముల్లో పంట ఏపుగా పెరగక దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చేవి ఈసారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. వర్షాలు భారీగా కురవడంతో తేమ తగ్గలేదు. ఈ పరిణామం సాగులో ఉన్న పైర్లకు అనుకూలించింది. ఇటు రేగడి అటు చెల్క పొలాల్లో పైర్ల సాగు బాగుంది. జులై, ఆగస్టులో పైర్లు పెరిగే తొలి దశలో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు పొలాల్లో కొంత మేరకు దెబ్బతిన్నాయి. వర్షాలను తట్టుకుని నిలిచిన పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. ః 2023-24 ఆర్థిక సంవత్సరంలో తాండూరు సహా మిగిలిన తొమ్మిది విపణుల్లో కలిపి రైతులు 2లక్షల క్వింటాళ్లకు పైబడి కందుల విక్రయాలు చేశారు.

**తాండూరు రకంలో 'అట్టాపుల్ గేట్'**

తాండూరు నియోజకవర్గంలో కంది పంట సాగయ్యే నేలల్లో 'అట్టాపుల్ గేట్' అనే ఖనిజం ఉంది. సాగులో ఉన్న కంది పైరు కాండం ధ్రుఢంగా ఉండేందుకు ఈ ఖనిజం దోహదం చేస్తుంది. నాణ్యమైన గింజలు రావడానికి, అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉండేలా చూస్తుంది. ఆమేరకు తాండూరు ప్రాంతంలో సాగయ్యే కందులతో ఉత్పత్తి చేసిన పప్పుకు రుచి ఎక్కువ.

**పచ్చపురుగు నివారణలో నిర్లక్ష్యం చేయొద్దు**

- డాక్టర్ సుధాకర్, వ్యవసాయ శాస్త్రవేత్త, తాండూరు.

జిల్లాలో కంది పైర్లపై ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పచ్చపురుగు ఉద్ధృతి పెరిగే అవకాశం ఉంది. పురుగు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు.లీటరు నీటికి 0.3మి.లీ స్పైనోషాడ్ లేదంటే క్లోరో పైరిఫాస్ లీటరు నీటికి 2.5 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

## పూడిక తీయరు.. మరమ్మతు చేయరు

సారంగాపూర్ : ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతుతోపాటు పూడిక తొలగించకపోవడంతో ఏటా చివరి గ్రామాల ఆయకట్టు రైతులకు నీరందక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. వానాకాలం పంటలకు నీటి ఇబ్బంది లేనప్పటికీ యాసంగి పంటలకు చివరి దశలో సాగు నీరందక ఆయకట్టు రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. డి-53, 12ఎల్ ద్వారా ఎస్సారెస్పీ కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు నీరందిస్తున్నారు. కొంత కాలంగా కాలువల్లో పూడిక తొలగించక పోవడంతో చివరి గ్రామాలకు నీరు చేరుకోవడం లేదు. అంతేకాకుండా కాలువలపై ఉన్న తూములు, గండ్లు పూడ్చకపోవడంతో పైప్రాంతంలో నీరు వృథా అవుతోంది. చివరి గ్రామాలైన సారంగాపూర్, బట్టపల్లి, పోతారంతోపాటు పలు గ్రామాలకు నీరు చేరకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉండడంతో ఆయకట్టు నీటి విడుదల నిలిపివేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల్లో పూడిక తొలగిస్తే కూలీలకు ఉపాధి కల్పించడమే కాకుండా రైతులకు ప్రయోజనకరంగా ఉండనుంది. అధికారులు దృష్టి సారించకపోవడంతో చివరి గ్రామాలకు నీరు చేరుకోవడం కష్టంగా మారనుంది. ఆయకట్టు పరిధిలోని 12ఎల్ 1ఆర్ కాలువపై మరమ్మతు చేపట్టేందుకు అధికారులు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. నిధులు మంజూరు చేసి మరమ్మతు చేసినట్లయితే పైప్రాంతంలో నీరు వృథా కాకుండా ఉండడమే కాకుండా చివరి గ్రామాలకు నీరు చేరుకుంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**నీటి మళ్లింపునకు ప్రతిపాదనలు** డి53 ప్రధాన కాలువ నుంచి సారంగాపూర్ చింతల చెరువులోకి నీటిని తరలించేందుకు ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు రూ.20 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. సారంగాపూర్, బట్టపల్లి, పోతారం రైతులు చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని కాలువ ద్వారా నింపాలని పలుమార్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సర్వే నిర్వహించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించడంతో పలు మార్లు సర్వే చేపట్టారు. పెంబట్ల పెద్దమ్మ చెరువు నుంచి చింతల చెరువులోకి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకెళ్లవచ్చని సర్వే పూర్తి చేసి ఎమ్మెల్సీకి నివేదించారు. దాదాపు రూ.20 కోట్లు వ్యయం చేసినట్లయితే చెరువులోకి నీటిని మళ్లించవచ్చని ప్రతిపాదనలు తయారు చేసి అందించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి నిధుల మంజూరుకు తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ పలుమార్లు రైతులకు హామీచ్చారు.

**ఇదే అనువైన సమయం- నలువాల రాజయ్య, రైతు**

ఏటా యాసంగిలో చివరి ఆయకట్టుకు నీరందక పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. ఇప్పుడే కాలువల్లో పూడిక తొలగించి, తూములకు షట్టర్లు బిగించినట్లయితే చివరి వరకు నీరు చేరుకునే అవకాశముంటుంది.

## ప్రతిపాదనలు ఘనం.. అమలు అర్ధంతరం

సిరిసిల్ల : జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు చేపట్టడం లేదు. 2023-24 బడ్జెట్‌లో రెండు పురపాలికల్లో కలిపి వివిధ విభాగాల్లో అభివృద్ధికి రూ. 118.36 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. వీటి మంజూరుకు ప్రభుత్వానికి కూడా పంపారు. వాటిలో రూ.18 కోట్లు మాత్రమే ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. అంటే నిర్ణయించిన బడ్జెట్‌లో 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. రెండు పురపాలికల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభం కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పన్నుల రూపంలో వస్తున్న రూ.4 కోట్ల ఆదాయంలో ఉద్యోగుల జీతాలు, పారిశుద్ధ్యం నిర్వహణ, ఇతరత్రా ఖర్చులే నెలకు రూ.కోటిపైనే ఉంటున్నాయి. వీటిలోనూ చాలా వరకు గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులు ఉన్నాయి.

**ముందుకు రాని గుత్తేదారులు**

2023-24 పురపాలక బడ్జెట్‌లో రూ.47.70 కోట్లతో వార్డుల వారీగా మురుగుకాల్వలు, సీసీ రహదారులు, కేంద్రీయ విద్యుద్దీకరణ, కూడళ్ల విస్తరణకు టీయూఎఫ్ఐడీసీ కింద ప్రతిపాదనలు చేశారు. వీటిలో సీసీ రహదారులు, మురుగు కాల్వల పనులు టెండర్ల దశలో నిలిచిపోయాయి.రూ.3 కోట్లతో కలెక్టరేట్-రగుడు కూడలి విస్తరణ



పనులు దక్కించుకున్న గుత్తేదారు పైపైన పనులు చేసి వదిలేశాడు. ఏడాదిగా ఆ పనులు ముందుకు సాగడం లేదు. చంద్రంపేట, శాంతినగర్, నర్సింగ్‌కాలేజీ, సంజీవయ్య కూడళ్ల అభివృద్ధికి రూ.2 కోట్ల పనులు దక్కించుకున్న గుత్తేదారులు ముందుకు రావడం లేదు. రూ.2 కోట్లతో కళాశాల ఆవరణలో క్రీడా మైదానం పనులు ప్రారంభించి వదిలేశారు.సిరిసిల్ల- వెంకటాపూర్ బాహ్యవలయ రహదారిలో రూ.4.60 కోట్లతో కేంద్రీయ విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పురపాలికకు అప్పగించలేదు. గత ప్రభుత్వ హయాంలో పురపాలికలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినా నిధులు మాత్రం పూర్తిగా విడుదల చేయలేదు. దీంతో పురపాలికలో అన్ని విభాగాల్లో పనులు చేసిన గుత్తేదారులకు పెద్ద ఎత్తున బకాయిలు పడింది. ఇటీవల వినాయక చవితి, బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

వేములవాడ పురపాలికలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే అంబేద్కర్ కూడలి విస్తరణ, క్రీడా మైదానంలో ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పురపాలికలో దాదాపు పనులన్నీ నిలిచిపోవడంతో సిరిసిల్ల పురపాలక కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ నిధుల విడుదలకు ఉన్నతాధికారులను కోరుతూ రెండు నెలల క్రితం లేఖ రాశారు. దీనికి గతంలో నిధులు మంజూరై టెండర్లు పూర్తయిన పనులు చేసుకునేలా మౌఖికంగా ఆదేశించారు. ప్రతిపాదించిన పనులకు నిధుల మంజూరు విషయమై ఎలాంటి సమాచారం రాలేదు. విలీన గ్రామాలు, శివారు కాలనీలో అంతర్గత రహదారులు, మురుగుకాల్వల నిర్మాణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

## కొత్త వీసీ ఎదుట సవాళ్లెన్నో!

కరీంనగర్ : ఎట్టకేలకు శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఉమేశ్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. ఆయన బాధ్యతలు స్వీకరించనుండగా.. ఆయనకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి..

ఈ ఏడాది మే 21వ తేదీన అప్పటి ఉప కులపతిగా ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీసీ పోస్ట్ కోసం 158 మంది ఆచార్యులు దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు ఇక్కడి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీగా ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు వెలువరించింది. 2008లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటినుంచి ఇప్పటి వరకు ముగ్గురే పూర్తిస్థాయి వీసీలుగా పనిచేశారు. మొదటి ఉప కులపతిగా మహ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ఎస్.మల్లేశ్ రెగ్యులర్ వీసీలుగా కొనసాగారు.



రిజిస్ట్రార్‌గా రెండేళ్లు..ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్ రసాయన శాస్త్ర ఆచార్యుడిగా పలుచోట్ల సేవలు అందించారు. 2018- 2020 మధ్య శాతవాహన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఆ పదవికి వన్నెతెచ్చే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఆయన హయాంలోనే స్నాతకోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అదే మొదటి.. చివరి స్నాతకోత్సవం కావడం గమనార్హం. రహదారులు, వసతి గృహాల నిర్మాణాలు, అంబులెన్స్ ఏర్పాటు, ఏటీఎం సదుపాయాలు విద్యార్థులకు కల్పించారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా, ఇన్‌ఛార్జి వీసీగానూ ఈయన పనిచేశారు.

వీటిపై దృష్టి పెడితేనే..గడిచిన కొన్నేళ్లుగా విశ్వవిద్యాలయంలో నిధుల దుర్వినియోగం, అవినీతిపై ఆరోపణలు విపరీతంగా వచ్చాయి. ఇటీవల ఇక్కడి వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు కూడా చేపట్టారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ, అవినీతికి ఆస్కారం లేకుండా సంస్కరణలకు, మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలి. మరో వసతి గృహ భవనం నిర్మిస్తే ఇరుకిరుకుగా ఉండాల్సిన అవసరం తప్పుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చడం, కొత్త పోస్టులను మంజూరు చేయించడం, ఖాళీలు లేకుండా చూడటంలాంటి చర్యలతో ముందుకు సాగాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఇవన్నీ పక్కాగా ఉంటేనే న్యాక్ గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 12బీ హోదా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో నిధులను రాబట్టడంపై కొత్త వీసీ దృష్టి పెట్టాలి. మారుతున్న కాలంతోపాటు కొత్త కోర్సుల ఆవశ్యకతను గుర్తించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుని అందించాలి.

# ఆలయాల సమాచారం.. అంతర్జాలంలో నిక్షిప్తం

కరీంనగర్ : దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల పూర్తి సమాచారం అంతర్జాలంలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా ఆలయాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుళ్లను సులభంగా గుర్తించేలా వాటి పరిధిలోని భూములు, ఆస్తుల వివరాలు తక్షణమే తెలిసేలా చేస్తున్నారు. ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా ఆధునిక సాంకేతికను వినియోగించుకుంటున్నారు. అన్ని రకాల దేవాలయాల సమాచారాన్ని జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం)తో అనుసంధాన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. సమాచారం గూగుల్ మ్యాప్స్‌లో పొందేలా త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ విధానంతో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకట్ట పడనుంది.

**అన్నింటికి జియో ట్యాగింగ్**

దేవాలయం ఎక్కడ ఉంది? దాని సరిహద్దులు ఏమిటి? దాని పరిధిలోని భూములు ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ఇలా ఆలయానికి సంబంధించిన ప్రతీ అంశం ప్రజలకు తెలిసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమాచారం పొందుపరుస్తున్నారు.

దేవాదాయ శాఖ పరిధిలో పబ్లికేషన్, రిజిస్టర్ అయి ఉన్న దేవాలయాలు, ధూపదీప నివేదన పథకంతోపాటు అన్ని రకాల ఆలయాలను జియో ట్యాగింగ్ చేస్తున్నారు.

గూగుల్ మ్యాప్స్‌లో ఏ ఆలయానికి సంబంధించిన సమాచారం



కావాలనుకుంటే టైప్ చేస్తే చాలు.. పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది. భూములు, ఆస్తుల వివరాలను సైతం ఫొటోల ద్వారా సేకరించి ప్రభుత్వ ధరణి వెబ్‌సైట్ నుంచి జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) ద్వారా పరిశీలించి ఆయా భూముల సరిహద్దులను మార్కింగ్ చేస్తున్నారు. జియో ట్యాగింగ్‌లో జీపీఎస్ ద్వారా ఫిక్స్ చేస్తున్నారు. భవిష్యత్తులో మొబైల్ యాప్‌ను రూపొందించేందుకు దేవాదాయ శాఖ కసరత్తు చేస్తోంది.

ఈవోలు, సిబ్బందితో జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్‌లో ఫొటోలను తీయించి అక్షాంశాలు, రేఖాంశాలు, ప్రాంతం (లోకేషన్) ఆధారంగా సమాచారాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. అక్కడ జియో ట్యాగింగ్‌తో ఆలయాలకు సంబంధించిన కోఆర్డినేట్ చేసి నిర్ధారిస్తారు.

**అన్యాక్రాంతం కాకుండా..**

ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవిష్యత్తులో ఏదైన ఆలయ భూమి కబ్జాకు గురైతే తెలుసుకోవచ్చు. గూగుల్ మ్యాప్‌లో సర్చ్ చేస్తే చాలు అక్షాంశాలు, రేఖాంశాలతో మనకు ఆ ప్రదేశం చూపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని దేవాలయాల సమాచారం పక్కగా తెలిసేలా జియో ట్యాగింగ్ చేస్తున్నాం. దేవాలయ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు ఇది దోహదపడుతుంది. – సుప్రియ, సహాయ కమిషనర్, దేవాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా

# ప్రగతి చక్రం.. పల్లెకు దూరం

కొడిమ్యాల: ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం ప్రవేశపెట్టడంతో తమ గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రభుత్వం తారు రోడ్లు, బస్సు షెల్టర్లు నిర్మిస్తున్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. కొడిమ్యాల మండలం నమిలికొండ మీదుగా శ్రీరాములపల్లె, తిప్పాయిపల్లి, నల్లగొండ వరకు తారురోడ్డు ఉన్నప్పటికీ చాలా ఏళ్లుగా బస్సు సదుపాయం లేకపోవడంతో ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురువుతున్నారు. బస్సు సదుపాయం కల్పిస్తే కరీంనగర్, జగిత్యాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. గతంలో జగిత్యాల నుంచి మల్యాల, బల్వంతాపూర్, సర్వాపూర్, నర్సింహులపల్లె, గౌరాపూర్ మీదుగా పూడూర్ వరకు బస్సు సదుపాయం ఉండేది. కొన్నేళ్లుగా బస్సును నిలిపివేయడంతో ఆ గ్రామాల ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దమ్మయ్యపేట, బోల్లోనిచెరువు, చింతలపల్లి గ్రామాలకు నేటికీ బస్సు



సౌకర్యంలేదు. జగిత్యాల నుంచి కొడిమ్యాల, రామకిష్టాపూర్, చెప్యాల నల్లగొండ మీదుగా సికింద్రాబాద్ వరకు బస్సు సదుపాయం ఉండగా కొన్నేళ్ల క్రితం ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు.

**పునరుద్ధరించాలి..**

గతంలో జగిత్యాల నుంచి వయా కొడిమ్యాల, రామకిష్టాపూర్, చెప్యాల, వేములవాడ మీదుగా సికింద్రాబాద్ వరకు పల్లెవెలుగు బస్సు సదుపాయం ఉండేది. దీంతో గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలకు సౌకర్యంగా ఉండేది. కొన్నేళ్లుగా బస్సును నిలిపివేయడంతో గ్రామస్థులు ఎటువెళ్లాలన్నా ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్సును పునరుద్ధరిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– దయ్యాల రవి, రామకిష్టాపూర్

**ప్రైవేటు వాహనాలే దిక్కు..**

నమిలికొండ గ్రామం నుంచి శ్రీరాములపల్లె, తిప్పాయిపల్లె గ్రామాలకు తారురోడ్డు ఉన్నప్పటికీ బస్సు సదుపాయం లేకపోవడంతో ఆయా గ్రామస్థులు ఏళ్లుగా ప్రైవేటు వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నందున గ్రామీణ ప్రాంతాలకు సైతం బస్సు సదుపాయం కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఇరుమల్ల రమేష్, నమిలికొండ

# స్పందించకుంటే అన్యాక్రాంతం..



కాగజ్‌నగర్ : ప్రభుత్వ స్థలాల రక్షణకు అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో.. పలువురు కబ్జాకు పాల్పడుతున్నారు. కాగజ్‌నగర్‌లో రోజు రోజుకూ జనాభా, భూముల క్రయవిక్రయాలు పెరుగుతున్నాయి. పలువురు బల్దియా భూములను కబ్జా చేసి తమ పేరున మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భూముల్లో బోర్డులు సైతం ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంపై ఆంతర్యమేంటని పట్టణవాసులు చర్చించుకుంటున్నారు.

**న్యాయ స్థానమే తేల్చినా..**

కాగజ్‌నగర్ పురపాలిక కార్యాలయానికి సర్వే నం.147/2లో 4.50 ఎకరాల స్థలాన్ని 2008లో ప్రభుత్వం కేటాయించగా.. కార్యాలయం నిర్మించారు. రోడ్డుకు మరోవైపు ఎన్టీయార్ చౌరస్తా సమీపంలో ఉన్న కొంత ఖాళీ స్థలాన్ని అలాగే వదిలేశారు. రూ.కోట్లు విలువ చేసే ఈ భూమిని ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నించారు. ఈ స్థలం తమదేనంటూ సర్వే నం.146 పట్టాదారుతో కలిసి కోర్టును ఆశ్రయించారు. జులై 13న ఈ స్థలంలో ఇల్లు ఉన్నట్టుగా ఇంటి నంబర్ కోసం దరఖాస్తు చేసుకోగా.. అయిదు రోజుల వ్యవధిలోనే ఇంటి నం.1-15-552/4/3/ఏ/1 కేటాయించారు. విషయం బయటకు రావడంతో.. అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పురపాలిక, ప్రైవేట్ వ్యక్తికి మధ్య కొనసాగిన వివాదానికి తెరదించుతూ.. ఇటీవలే ఈ స్థలం బల్దియాదేనంటూ సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్టు తీర్పునిచ్చింది.

బల్దియా ఆధ్వర్యంలో మటన్ మార్కెట్ వెళ్లే దారిలో 1971-72లో మేకలు, గొర్రెల వధశాల ఏర్పాటు చేశారు. ఏళ్లుగా ఇక్కడ మేకలను వధించి మార్కెట్‌కు తరలించేవారని, కాలక్రమంలో స్థలం ఖాళీగా ఉందని స్థానికులు చెబుతున్నారు. అయితే దాని పక్కనున్న స్థలంతో కలిపి ఈ భూమిని ఓ వ్యక్తి తన పేరు మీదకు మార్చుకున్నాడు. అనంతరం ఓ వ్యాపారికి విక్రయించగా అతను ఇంటి నంబరు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. గతంలో పాలకవర్గ సభ్యులు నిలదీయడంతో మరుగునపడింది. ప్రస్తుతం పాలకవర్గం గడువు సమీపిస్తుండటంతో.. ఇటీవల ఇంటి నంబర్ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

ద్వారకానగర్‌లోని పురపాలిక స్థలాన్ని ఓ వ్యక్తికి అద్దెకు ఇవ్వగా.. తాను అక్కడ తాత్కాలిక ఇల్లు కట్టుకున్నాడు. అధికారులు నోటీసులు జారీ చేయడంతో ఎట్టకేలకు ఖాళీ చేశాడు. ప్రస్తుతం దీనిపై పలువురి కన్నుపడటంతో.. కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని నిరాశ్రయులకు రాత్రి బస కోసం పునరావాస కేంద్రం నిర్మాణానికి సర్వే నం.143లో ప్రభుత్వం స్థలం కేటాయించింది. కేంద్రం నిర్మాణానికి టెండర్లు సైతం పిలిచారు. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో.. పలువురు ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. రెండు అడుగుల ఎత్తులో ప్రహరీ సైతం నిర్మించారు.

**రక్షణకు చర్యలు - అంజయ్య, పుర కమిషనర్, కాగజ్‌నగర్**

బల్దియాకు కేటాయించిన స్థలాల రక్షణకు చర్యలు తీసుకుంటాం. మటన్ మార్కెట్ దారిలోని స్థలం అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న విషయం దృష్టికి వచ్చింది. ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ద్వారకానగర్‌లోని స్థలం సైతం స్వాధీనంలోకి తీసుకుంటాం. స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తాం.

# పంచాయతీ ఎన్నికల గుర్తులు వచ్చేశాయ్..




ఆదిలాబాద్ : పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల తుది జాబితా విడుదల చేయగా బ్యాలెట్ పెట్టెలు సిద్ధం చేయడం, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సౌకర్యాల పరిశీలన, నోడల్ అధికారుల నియామకం తదితర పనులు పూర్తి చేశారు. తాజాగా సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పత్రాల ముద్రణ, గుర్తులు తదితర వాటిపై ఆదేశాలు జారీ అయ్యాయి. సర్పంచి ఎన్నికల కోసం 30 గుర్తులు, వార్డు సభ్యులను ఎన్నుకునేందుకు వీలుగా 20 గుర్తులను కేటాయించారు. సర్పంచి కోసం గులాబి రంగుపై, వార్డు సభ్యుల కోసం తెలుపురంగు కాగితంపై గుర్తులు ముద్రించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పార్టీ రహితంగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు తెలిసిన గుర్తులను కేటాయించారు. సర్పంచి ఎన్నిక కోసం బ్యాట్, బాట్స్‌మెన్, స్టంప్స్, ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, లేడీపర్సు, టీవీ రిమోట్, టూత్‌పేస్టు, పాన, చెత్తడబ్బా, నల్లబోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, పడవ, బిస్కెట్, వేణువు, చైన్, చెప్పులు, గాలిబుడగ, తదితర వాటిని గుర్తులుగా నిర్ణయించారు.

**టెండర్లకు ఏర్పాటు**

వార్డుల సభ్యులను ఎన్నుకునేందుకు బ్యాలెట్ పత్రంలో గౌను, గ్యాస్, పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్‌యాంటినా, గరాటా, మూకుడు, ఐస్‌క్రీం, గాజుగ్లాసు, పోస్టుడబ్బా, కవర్, హాకీ కర్రబంతి, నెక్‌టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్తు స్తంభం, కేటిల్ తదితర వాటిని కేటాయించారు. గుర్తులను కేటాయించడంతో బ్యాలెట్ పత్రాల ఏర్పాటు, ముద్రణ తదితర వాటికి జిల్లా స్థాయిలో టెండర్లు ఆహ్వానించే ఏర్పాట్లు చేస్తున్నారు.

**నోటాకు చోటు** పోటీలోని అభ్యర్థులెవరూ నచ్చకపోతే నోటాకు ఓటు వేయవచ్చు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో బ్యాలెట్ యూనిట్‌లో చివరలో నోటా బటన్ ఉన్నట్లే.. సర్పంచి, వార్డుసభ్యుల బ్యాలెట్ పత్రాల్లో చివరన నోటా ముద్రించనున్నారు. సర్పంచికి 30, వార్డు సభ్యులకు 20 గుర్తులతోపాటు అదనంగా నోటా ఉంటుందని అధికారులు తెలిపారు. ఉదాహరణకు ఎన్నికల్లో ఆరుగురు పోటీలో ఉంటే ఆరుగురికి కేటాయించిన గుర్తులతోపాటు చివరలో నోటా గుర్తు ఉంటుంది. పోటీ చేసిన వారిలో ఎవరికి ఓటు వేయడం ఇష్టం లేకపోతే నోటాకు ఓటు వేయవచ్చు.

# కొనేవారేరి..?



దండేపల్లి : అన్నదాతకు విత్తనం విత్తిన నుంచి పంట పండించేందుకు ఎంత కష్టపడతారో చేతికి వచ్చిన పంటను అమ్ముకునేందుకు అంతకన్నా ఎక్కువ కష్టపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈసారి సన్నాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పడంతో రైతులు ఈ సీజన్‌లో సన్నాలను ఎక్కువగా సాగు చేశారు. దొడ్డు రకాన్ని ఎలాగూ ప్రభుత్వమే కొంటోంది. ఈ సారి మాత్రం ఎంపిక చేసిన సన్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి బోనస్ చెల్లిస్తోంది. అయితే రైతులు సాగు చేసిన వాటిలో ప్రభుత్వం ఎంపిక చేసినవి లేకపోవడంతో వీటిని కేంద్రాల్లో అమ్ముకోలేక.. కొనేవారు లేక అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి పొలాల్లో, రహదారుల పక్కన కుప్పలుగా పోసి అక్కడే పడిగాపులు కాస్తున్నారు. గతేడాది సీజన్ ప్రారంభంలోనే సన్నాలకు వ్యాపారులకు క్వింటాలుకు రూ.మూడు వేల నుంచి రూ.3,200 వరకు ధరతో కొనుగోలు చేశారు. కానీ ప్రస్తుతం రూ.2,600 నుంచి రూ.2,700 మాత్రమే అంటున్నారు. అయినా అమ్ముదామంటే కొనడానికి ముందుకు రావడం లేదు.

**వాతావరణంలో మార్పులతో ఇబ్బందులు**

మరోవైపు వాతావరణంలో మబ్బులు రావడంతో పాటు అక్కడక్కడ చిరుజల్లులు పడటంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు తిప్పలు పడాల్సి వస్తోంది. రోజంతా ఆరబోయడం, రాత్రి కాగానే తిరిగి కుప్ప చేస్తూ అవస్థలు పడుతున్నారు. వీటిని కాపాడుకునేందుకు అవసరమైన కవర్లకు వేలకు వేలు అద్దె చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ధాన్యం కొనేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**వడ్లు కోసి 40 రోజులవుతోంది - భారతపు లావణ్య, కొండాపూర్, దండేపల్లి మండలం** మాకున్న మూడు ఎకరాలలో సన్న వరి వేయగా కోసి 40 రోజులవుతోంది. రోజూ ఆరబోస్తున్నాం.. సాయంత్రం కాగానే కుప్ప చేస్తున్నాం. ఇదిలా ఉండగా వాతావరణం తడిగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేపట్టాలి.

# ఆశల 'సాగు'రం

గరిడేపల్లి : నాగార్జునసాగర్ జలాశయంలో నీటి మట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆగస్టులో వచ్చిన వరదలకు ఎగువ జలాశయాలు నిండి దిగువకు భారీగా వరద రావడంతో కొద్ది రోజుల్లోనే సాగర్ నిండింది. నిండిన తర్వాత సైతం వరదలు తగ్గకపోవడంతో సముద్రంలోకి భారీగా నీరు విడుదల చేశారు. అక్టోబరులోనూ వరదలు రావడంతో జలాశయాలు నిండుకుండల్లా ఉండటం, ప్రస్తుత వానాకాలం పూర్తయినా నీటి నిల్వలు తగ్గకపోవడంతో వచ్చే వానాకాలం సాగుపై పూర్తి విశ్వాసం నెలకొంది. నీటిని ఇలాగే ఉంచితే వచ్చే ఏడాది ముందస్తుగానే విడుదల చేపట్టి నాట్లు, వెదజల్లుడు పూర్తి చేసుకోవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సాగర్ జలాశయంలో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 587 అడుగుల మేర నీరు ఉంది. అంటే 305 టీఎంసీలు. శ్రీశైలం జలాశయంలోనూ 885 అడుగులకు గాను 866 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా కొంత నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీన్ని నిలువరించితే చాలా వరకు జలాశయంలో నీటి నిల్వలు తగ్గవు.

**అక్టోబరులోనూ వరదలు..**

సాధారణంగా నైరుతి రుతుపవనాలు ఉద్ధృతంగా వ్యాపించిన సమయంలో అంటే ఆగస్టు, సెప్టెంబర్లలో కర్ణాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు పడి వరదలు వస్తాయి. అదే వరదతో ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం జలాశయాలు నిండుతాయి. ఆ తర్వాత వరదలు వచ్చినా సాగు, తాగునీటి అవసరాలకు పోగా మిగులు నామమాత్రం



గానే ఉంటుంది. సాగర్ జలాశయానికి అక్టోబరులో వచ్చిన వరదను బట్టి సాగర్ కుడి, ఎడమ కాల్వలతో పాటు విద్యుదుత్పత్తి, తాగునీటి అవసరాలకు పోగా సముద్రంలోకి నీటిని వదిలారు. అంటే కేవలం నవంబరు నెలలోనే నిల్వ నీటిని వాడుకున్నారు.

**పొదుపుగా వాడుకుంటే..** ప్రస్తుతం నీటి నిల్వలు రెండు సీజన్‌లకు సరిపోతాయని అధికారులు సైతం పేర్కొంటున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు రాజకీయలకు అతీతంగా విద్యుదుత్పత్తి, కుడి కాల్వకు కేటాయింపులు, ఎడమ కాల్వకు నీటి విడుదల.. అన్నింటిని క్రమపద్ధతిలో నిర్వహిస్తే జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గకుండా జాగ్రత్త పడవచ్చునని సూచిస్తున్నారు. సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో 95 శాతం వరి సాగు చేపడుతున్నందున వచ్చే వానాకాలం సమయానికి వర్షాలు లేకపోయినా సకాలంలో నీరు విడుదల చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. యాసంగి అవసరాలకు పోగా వానాకాలం నాటికి 560 అడుగుల మేర నీరున్నా ఒక పంటకు ఢోకా ఉండదని, ఈలోగా నైరుతి రుతుపవనాలు విస్తరించి వర్షాలు పడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# దిగువకు ధరలు.. రైతన్న దిగాలు

సిద్దిపేట : అకాల వానలతో ఓ పంట.. సకాలంలో కురవక మరో పంట.. మద్దతు ధర తగినంత లేక ఇంకో పంట.. ఇలా ఆరుగాలం కష్టపడి జనానికి ఆహారాన్నందించే రైతన్న ఏదోఒక విధంగా నష్టం చూస్తూనే ఉన్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు తగ్గిపోయి పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి కనిపించక కర్షకులు ఆందోళన చెందుతున్నారు. నవంబరు 31 వరకు ఓ మోస్తరు ఉన్న కూరగాయల ధరలు డిసెంబరులో తగ్గుముఖం పట్టాయి. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాలతో పాటు కొన్ని మండలాల్లో కూరగాయలను పండిస్తారు. మండల కేంద్రాల్లో రైతులు పండించిన కూరగాయలను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పలువురు రైతులు స్థానిక మార్కెట్‌లలో విక్రయిస్తున్నారు. మరికొందరు హైదరాబాద్, ఇతర నగరాలకు తరలిస్తున్నారు. 13 రోజుల నుంచి పరిశీలిస్తే టమాటా, బెండ, కాకర,



వంకాయ ధరలు ఎక్కువగా పడిపోయాయి. వాటి సాగుకు పెట్టిన పెట్టుబడులు సైతం రావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.6కే 15 కిలోలు..** ప్రస్తుతం పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్న సమయంలోనూ సాధారణంగా వంకాయకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. అందుకు భిన్నంగా వంకాయ ధరలు అమాంతం పడిపోయాయి. జిల్లాలో రైతులు వంద ఎకరాల్లో వంకాయ తోటలను సాగు చేశారు. ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుండటంతో అన్ని మార్కెట్‌లలో వంకాయ లభిస్తోంది. రెండు రోజులుగా బహిరంగ మార్కెట్లో వంకాయ రూ.6కే 15 కిలోల వరకు రైతులు వినియోగదారులకు విక్రయించారు. చేనులో వంకాయ కోసి, రవాణా చేసేందుకు అయ్యే ఖర్చు కంటే అమ్మకంతో తక్కువగా వస్తుండటంతో కొందరు రైతులు మొక్కలపైనే కాయలను వదిలేస్తున్నారు. అద్దెకర పొలంలో రూ.30 వేలు ఖర్చు చేసి సాగు చేసిన వంకాయ తోటను ధర లేక వదిలి పెట్టానని చిన్నకోడూరు రైతు మల్లేశం తెలిపారు.

**తగ్గడానికి కొన్ని కారణాలు**

దిగుబడి పెరిగింది.

పొరుగు రాష్ట్రాల నుంచి రాక

చిన్న కమతాల్లోనే ఎక్కువ మంది రైతులు వేయడంతో విస్తీర్ణం పెరిగింది.: టమాటలాంటివి త్వరగా కుళ్లిపోతాయని త్వరగా అమ్మకం మొక్కజొన్న కోతలు, యాసంగి సీజన్ ప్రారంభం మధ్య ఉన్న కొద్ది రోజుల్లోనే కాయగూరలను పండించి ఎంతోకొంతకు అమ్మేయాలనే ఆలోచనతో తగ్గాయి.

పెట్టుబడి రాలేదు– మిద్దెల రమేశ్, చంద్లాపూర్

మాది చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామం. గత 15 ఏళ్లుగా 20 గుంటల విస్తీర్ణంలో బెండ తోట సాగు చేస్తున్నా. ప్రస్తుతం 20 గుంటల్లో చేశా. విత్తనం మొదలు ఇప్పటి వరకు రూ.15 వేలు పెట్టుబడి ఖర్చు అయింది. రెండు సార్లు మాత్రమే బెండకాయలు కోశా. కూలీలకు సైతం డబ్బులు రావడం లేదు. సరైన ధర లేకపోవడంతో పంటను మొక్కలపైనే వదిలేశా. పదిహేనేళ్లలో ఇంత తక్కువ ధర ఎప్పుడూ రాలేదు.

# స్నేహమా... మైకమా!

హైదరాబాద్ : ఉప్పల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి. చదువులో చురుగ్గా ఉండేవాడు. అకస్మాత్తుగా అతడి ప్రవర్తనలో మార్పు. కుటుంబసభ్యులతో పోట్లాడడం. తండ్రి జేబులో డబ్బులు కొట్టేయం చేసేవాడు. అనుమానం వచ్చి అతడి బ్యాగు పరిశీలిస్తే సిగరెట్లు కనిపించాయి. వాటిలో గంజాయి ఉంచి వాడుతున్నట్టు గుర్తించారు. మానసిక నిపుణుల కౌన్సెలింగ్‌లో అసలు విషయం వెల్లడించాడు. నగరంలో మాదకద్రవ్యాలు వినియోగిస్తూ, విక్రయిస్తూ పట్టుబడిన ప్రతి 100 మందిలో 90 మంది తాము మిత్రుల ద్వారానే అలవాటు పడినట్టు చెప్పినట్టు టీజీన్యాబ్ పరిశీలనలో గుర్తించారు.

**ఎందుకిలా మారుతున్నారంటే..** గంజాయి చాక్లెట్లు, బిస్కెట్లు విద్యార్థులకు విక్రయిస్తున్న పలు ముఠాలను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌లో తయారయ్యే వీటిని నగరం, శివారు ప్రాంతాల్లోని 10 ప్రముఖ పాఠశాలల్లోని సుమారు 200 మంది విద్యార్థులు తీసుకుంటున్నట్టు నిర్ధారించారు. జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ విద్యార్థిని 9వ తరగతిలోనే మత్తుమాత్రలకు దగ్గరైంది. బీటెక్ చేరేలోపు కొకైన్ తీసుకునేంతగా చేరిందని ఓ ఇన్‌స్పెక్టర్ వివరించారు. రోజుల తరబడి దగ్గుతో బాధపడుతున్న సమయంలో వైద్యపరీక్షల కోసం తల్లిదండ్రులు తీసుకొచ్చినపుడు వారికి గంజాయి అలవాటైనట్టు తెలుసుకుంటున్నారని జిస్టు వివరించారు.



**2 లక్షల మంది యాంటీ డ్రగ్ సోల్జర్స్..** నిత్యం రాష్ట్రంలో ఏదోమూలన గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటివి పట్టుబడుతున్నాయి. యువత జీవితాలను నాశనం చేస్తున్న వీటిని కట్టడి చేసేందుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీన్యాబ్) దూకుడు పెంచింది. విద్యార్థి దశలోనే వీటికి చేరువవుతున్న వారిని పసిగట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల స్థాయిలో ప్రహరీ క్లబ్‌లు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. సుమారు 2 లక్షల మంది విద్యార్థులను యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా తయారు చేసేందుకు వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు టీజీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు.

**ఒత్తిడి లేని వాతావరణమే పరిష్కార మార్గం**

సందీప్‌శాండిల్య, డైరెక్టర్, టీజీన్యాబ్‌పిల్లల కదలికలను ఇంట్లో తల్లిదండ్రులు, గురువులు గమనిస్తుండాలి. మార్కులు, ర్యాంకులు సాధించాలంటూ వారిపై ఒత్తిడి తీసుకురావద్దు. మానసిక ఆందోళనకు గురైనపుడు బయటపడేందుకు ఇటువంటి మత్తుపదార్థాల వైపు మొగ్గుచూపుతారనేది గుర్తించాలి. యువతీ, యువకులు తాము డ్రగ్స్‌కు అలవాటు కావటం వల్ల కుటుంబం ఎంతటి మనోవేదనకు గురవుతుందనేది తెలుసుకోవాలి. ఒత్తిడి ఎదురైనపుడు ఇష్టమైన అభిరుచులతో బయటపడొచ్చు. మత్తుపదార్థాల కట్టడిలో ప్రతిపౌరుడు భాగం కావాలి. వివరాలను 1908, 87126 71111 నంబర్లకు సమాచారం అందించండి.ప్రవర్తనలో తేడా గుర్తిస్తే ఉపేక్షించొద్దు– డాక్టర్ రమేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మానసిక వైద్యశాల

15–18 ఏళ్లుండే వారే ఎక్కువగా మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. చికిత్స కోసం ఇక్కడకు ప్రతి నెలా 10–15 మంది వస్తున్నారు. యుక్తవయసు పిల్లలు ఎక్కువగా మిత్రుల నుంచే వీటికి అలవాటవుతున్నారు. బిడ్డల ప్రవర్తన, మాటల్లో తేడా అనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే స్పందించాలి. మానసిక నిపుణుల వద్దకు తీసుకెళ్లి దాన్నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలి. ఇదంతా పిల్లలకు తెలియకుండా రహస్యంగా చేయవద్దు. సమస్యను వారితో పంచుకొని దాన్ని అధిగమించేందుకు చికిత్స అవసరమనే విషయం పంచుకోవాలి.

# కరుగుతున్న గుట్టలు.. కదలని అధికారులు

పరిగి : తాండూరు: తాండూరు నియోజకవర్గంలో గ్రామాలకు దూరంగా ఉంటున్న ప్రభుత్వ స్థలాల్లోని గుట్టలతో పాటు వ్యవసాయ పొలాల్లోని గుట్టలను అక్రమార్కులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. జిల్లాలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అడిగేవారు లేరన్న ధీమాతో రాత్రింబవళ్లు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా ప్రకృతికి చేటు తెస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పరిశీలనాత్మక' కథనం.

**జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో..**

ప్రధానంగా జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు ఇందుకు కేంద్రబిందువుగా మారాయి. తాండూరు, పెద్దేముల్, ధారూర్, మోమిన్‌పేట్, యాలాల్, కొడంగల్, నవాబుపేట, పరిగి, బంట్వారం, పూడూరు, కుల్కచర్ల తదితర మండలాల్లో అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ట్రాక్టరు మట్టిని రూ.400 నుంచి రూ.600 వరకు, టిప్పరు అయితే రూ.2500 నుంచి రూ.3వేల వరకు విక్రయిస్తున్నారు.

**రావాల్సిన ఆదాయానికి రూ.కోట్లల్లో తూట్లు**

మట్టి తవ్వకాలు చేపట్టే వారు ఒక్కో క్యూబిక్ మీటరు నుంచి రూ.30 చొప్పున రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలనే నిబంధనలు ఉన్నాయి. ఒక్కో ట్రాక్టరు 2.85 క్యూబిక్ మీటర్లు, లారీ 8.55 క్యూబిక్ మీటర్ల చొప్పున మట్టిని తరలించే సామర్థ్యం ఉంటుంది. అయితే వందల ట్రాక్టర్లు, లారీల్లో అక్రమంగానే తరలిపోతోంది.

**నిబంధనల పాటింపు ఎక్కడ**

నిర్ణీత ప్రదేశాల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మొదట గనుల శాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలు సవ్యంగా ఉంటే అధికారులు ఎన్‌ఓసీ (నోఆబ్జక్షన్ సర్టిఫికెట్)ను సంబంధిత తహసీల్దారుకు పంపుతారు. అన్ని ప్రక్రియలు సజావుగా పూర్తయితేనే గనుల శాఖ మట్టి తవ్వకాలకు అనుమతిస్తుంది. అయితే అక్రమార్కులు ఇవేమీ పట్టించు కోవడం లేదు.

ట్రాక్టర్ మట్టికి రూ.400 రూ.600 వసూలు

టిప్పర్‌కు రూ.2,500 రూ.3,000 వసూలు

**వ్యక్తులు మరణించినా ఆగడంలేదు**

మున్సిపల్ పరిధిలో మట్టి తరలిస్తున్న టిప్పర్ల కింద పడి ముగ్గురు వ్యక్తులు మృతి చెందినా తవ్వకాలు ఆగడంలేదు. పెద్దనందిగామ వద్ద, చిట్లపల్లి గ్రామం వద్ద, జాతీయ రహదారిలో గతంలో కేవలం మట్టి తరలిస్తున్న టిప్పర్లు ఢీ కొని ఒకరు మృత్యువాత పడ్డారు. వారికి నామమాత్రంగా డబ్బులు అందించి చేతులు దులిపేసుకున్నారు.

**కఠిన చర్యలు తప్పవు** మట్టి తవ్వకాల విషయం మైనింగ్ శాఖ అధికారులు పరిశీలించాలి. కాని మా దృష్టికి వచ్చిన మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. తవ్వకాలకు అనుమతులు తప్పక తీసుకోవాలి.బి.విజయ్‌కుమార్, తహసీల్దార్, కొడంగల్.

# ఆర్టీసీకి మహాలక్ష్మి కటాక్షం



కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమల్లోకి తెచ్చిన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా బస్ స్టేషన్లు రద్దీగా మారడంతోపాటు బస్సులు కిక్కిరిసిపోయాయి. ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత రీజియన్ వ్యాప్తంగా ఆర్టీసీకి వచ్చిన ఆదాయంపై మహాలక్ష్మి పథకం అమల్లోకి రాకముందు రీజియన్ వ్యాప్తంగా సుమారు 2.50 లక్షల మంది ప్రయాణించేవారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆ సంఖ్య రెట్టింపు అయింది. ఆదాయపరంగానూ గతంలో రూ.కోటి నుంచి రూ.1.20 కోట్లు వచ్చేది. ప్రస్తుతం రూ.2 కోట్లకుపైనే వస్తుండటం విశేషం. డిసెంబర్ 9, 2023 నుంచి నేటివరకు రీజియన్ వ్యాప్తంగా 16.17 కోట్ల మంది ప్రయాణించారు. ఇందులో మహిళా ప్రయాణికులు 11.11 కోట్ల మంది ఉన్నారు. రీజియన్‌లోని 11 డిపోల పరిధిలో మొత్తం రూ.876.39 కోట్ల ఆదాయంరాగా.. మహాలక్ష్మి ద్వారా రూ.445.63 కోట్ల ఆదాయం (51 శాతం) సమకూరింది.

**గోదావరిఖని మొదటి స్థానం** రీజియన్ పరిధిలోని గోదావరిఖని డిపో 2.42 కోట్ల ప్రయాణికులు, రూ.136.33 కోట్ల ఆదాయంతో మొదటి స్థానంలో నిలిచింది. జగిత్యాల డిపో 2.19 కోట్లమంది, రూ.119.12 కోట్లతో ద్వితీయ.. కరీంనగర్–2 డిపో 1.76 కోట్ల ప్రయాణికులు, ఆదాయపరంగా రూ.100.41 కోట్లతో తృతీయ స్థానాల్లో నిలిచాయి. హుస్నాబాద్ డిపో రూ.42.34 కోట్లతో చివరిస్థానంలో నిలిచింది. మహిళా ప్రయాణికుల పరంగాచూస్తే గోదావరిఖని డిపో 1.63 కోట్లమంది, జగిత్యాల డిపో 1.54 కోట్లు, కరీంనగర్–2 డిపో 1.13 కోట్లతో మొదటి మూడు స్థానాల్లో నిలవగా.. 58.75 లక్షల మందితో మంథని డిపో చివరి స్థానంలో నిలిచింది.

**సమష్టి సహకారంతోనే సాధ్యమైంది**

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చిన తర్వాత.. కార్పొరేషన్ పరిధిలో కరీంనగర్ రీజియన్ హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్లను మినహాయిస్తే మొదటి స్థానంలో నిలిచింది. వాటిని పరిగణలోకి తీసుకుంటే తృతీయ స్థానంలో ఉంటుంది. డ్రైవర్లు, కండక్టర్లు, అధికారులు, సిబ్బంది కృషి వల్లే ఇది సాధ్యమైంది. – రాజు, ఆర్‌ఎం, కరీంనగర్ రీజియన్

# తనిఖీల్లేవు.. వసూళ్లే..!



సిరిసిల్ల: దుకాణాల్లో ప్రజలకు విక్రయిస్తున్న తినుబండారాలు.. హోటళ్లలో పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలు నాణ్యమైనవా? నకిలీవా? పసిగట్టేందుకు జిల్లాలో ఆహార తనిఖీ విభాగం ఉంటుంది. వీరు దుకాణాలు, హోటళ్లలో కల్తీని నియంత్రించేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. అవసరమైతే నమూనాలు సేకరించి.. వాటిని పరీక్షకు పంపిస్తారు. నకిలీవని తేలితే కేసులు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తారు కానీ.. ఆ శాఖలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగి.. తానే అధికారినంటూ జిల్లాలో వసూళ్ల వ్యవహారం కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారు. వినియోగదారులు ఎవరైనా ఫిర్యాదు చేయాలన్నా కార్యాలయం, అందులోని సిబ్బంది సైతం అందుబాటులో ఉండరు. పురపాలికల్లోని హోటళ్ల నిర్వహణలో లోపాలు ఉంటే వినియోగదారుల ఫిర్యాదుల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని రెండు పురపాలికల్లోనూ సిబ్బంది కొరత కారణంగా వీరి పనులు చక్కబెట్టేందుకే సమయం సరిపోవడంలేదని చెబుతున్నారు.

వసూలు చేస్తున్న వ్యక్తిపై ఎఫ్‌ఎస్‌వో అనుషాను 'ఈనాడు' వివరణ కోరింది. "డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. అతను ఎవరని ఆరా తీయగా ఉమ్మడి జిల్లా కార్యాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందినట్లు తెలిసింది. అతనితో మాకు ఎలాంటి సంబంధం లేద"ని ఆమె పేర్కొన్నారు.

సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో ఏడు వేలకు పైగా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, శీతల పానీయాల దుకాణాలు ఉన్నాయి. విశ్రాంత ఉద్యోగికి తోడుగా పట్టణాల్లోని దుకాణాల నిర్వాహకులను కొంత మందిని మధ్యవర్తిగా ఏర్పాటు చేసుకున్నారు. సిద్దిపేట ఎఫ్‌ఎస్‌వో (ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్) జిల్లాకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించడం ఒక కారణమైతే.. కనీసం ఆ శాఖలో కిందిస్థాయి సిబ్బంది లేకపోవడం మరోకారణం. జిల్లా ఆవిర్భావం నుంచి వీరికి ప్రత్యేక కార్యాలయం లేకపోవడం గమనార్హం. ఇలాంటి పరిస్థితులను ఆసరాగా చేసుకుని జిల్లా వ్యాప్తంగా వసూళ్ల పరంపర సాగుతోంది.

నెలకు కొన్ని దుకాణాలు లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. దీనిలో చిన్న దుకాణానికి రూ.3 వేలు, ఒక మోస్తరు దుకాణానికి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. వీరికి పట్టణాలు, మండల కేంద్రాల్లోని ఒక వ్యాపారి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారు. అతనికి మిగతా వారంతా నెలవారీగా డబ్బులు ముట్టజెపుతున్నారు. మరికొన్ని చోట్లకు విశ్రాంత ఉద్యోగే నేరుగా వెళ్లి డబ్బులు తీసుకోవడం గమనార్హం. జులై 4న వీర్నపల్లి మండల కేంద్రంలో ఒక కారులో వచ్చి అక్కడున్న దుకాణాల వద్ద డబ్బులు వసూలు చేసుకుని వెళ్లారు. అలాగే శనివారం సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని పలు హోటళ్లలో ఇలానే వసూలు చేశారు. అక్కడి వారు ఏ శాఖ అని ప్రశ్నించడంతో సమాధానం చెప్పకుండానే కారులో జారుకున్నారు.

# వచ్చాయి.. వెళ్లాయి!




పెద్దపల్లి: రోడ్డు ప్రమాదాలు, అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు నిలిపే 108 వాహనాలు జిల్లాలో సరిపడే సంఖ్యలో లేవు. మారుమూల ప్రాంతాల ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు ఇటీవల ప్రభుత్వం జిల్లాలోని నాలుగు మండలాలకు కేటాయించిన అంబులెన్స్‌లను వెనక్కి తీసుకోవడం చర్చనీయాంశమవుతోంది. అవసరాలకు అనుగుణంగా 108 వాహనాల సంఖ్యను పెంచాల్సిన పాలకులు రాజకీయ ఒత్తిళ్లతో వెనకడుగు వేస్తున్నారు. పెద్దపల్లి, గోదావరిఖని ప్రధానాస్పత్రుల్లోని అంబులెన్స్‌లు సకాలంలో పనిచేయకపోవడం తదితర కారణాలతో 108 వాహనాలనే వినియోగిస్తున్నారు. మంథని, సుల్తానాబాద్ సామాజిక వైద్యశాలలకు కూడా 108లే దిక్కయ్యాయి. దీంతో వాటిపై ఒత్తిడి పెరిగి.. కొన్నిసార్లు అత్యవసర సమయాల్లో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది.

**మూడు మండలాలకు దూరం** పెద్దపల్లి, గోదావరిఖని, మంథని, కమాన్‌పూర్, బసంత్‌నగర్, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల ప్రాంతాలలో 108 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ వాహనాలు జిల్లా వ్యాప్తంగా సేవలందిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, ముత్తారం, అంతర్గాం మండలాలకు కేటాయించింది. కానీ అధికారులు మూడు వాహనాలను ఇతర జిల్లాలో కొరత ఉందని మెదక్‌కు పంపించారు. దీంతో అంతర్గాం మినహా మిగతా మూడు మండలాలకు 108 సేవలు దూరమయ్యాయి. దీనిపై జిల్లా 108 సమన్వయకర్త కుమారస్వామిని వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకే వాహనాలు వెనక్కి వెళ్లాయని.. మరో విడతలో జిల్లాలకు వస్తాయని చెప్పారు.

**ప్రభుత్వ న్యాయవాదుల నియామకం**

జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా సీనియర్ న్యాయవాది మార కిషోర్, సీనియర్ సివిల్ కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా మరో సీనియర్ న్యాయవాది ఉప్పు రాజన్నను నియమిస్తూ కలెక్టర్ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఆయా కోర్టులలో ప్రభుత్వ తరపున కేసులను వీరు వాదిస్తారు.

# ఏళ్ల తరబడి అదే తీరు

పెద్దపల్లి : మిల్లులకు ధాన్యం కేటాయింపులు.. ప్రభుత్వానికి బియ్యం బకాయిలు.. సీఎంఆర్ అప్పగించేందుకు మిల్లర్లకు గడువు పొడిగింపు.. లక్ష్య సాధనపై అధికారుల సమీక్షలు.. ఇదీ ఏటా జరుగుతున్న తతంగం.. ప్రతి సీజన్‌లో మిల్లర్లకు నిర్దేశించిన లెవీ కోటా అలాగే ఉండిపోతూ ఏళ్ల తరబడి పాత బకాయిలు పేరుకుపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అత్యంత వివాదాస్పదంగా మారిన 2018 ధాన్యం బకాయిలు పూర్తి చేయడానికి ప్రభుత్వం ఏటికేడు గడువు పొడిగిస్తూనే ఉంది. ఈ కోటాను పూర్తి చేయడానికి మరోసారి వచ్చే జనవరి 20 వరకు గడువు విధించారు. ఇవే కాకుండా 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించి రెండు సీజన్‌లకు చెందిన సీఎంఆర్ కోటా ఇప్పటికీ పూర్తి కాలేదు.

**వెంటాడుతున్న రెండేళ్ల నాటి బకాయిలు**

తాము బకాయి పడిన ధాన్యాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తుందనే ప్రచారంతో జిల్లాలోని పలువురు మిల్లరు బియ్యం అప్పగించకుండా ఉండిపోతున్నారు. 2022–23లో వేలం ద్వారా ధాన్యం దక్కించుకున్న గుత్తేదారులు మిల్లర్ల నుంచే సేకరించాల్సి ఉండటం సమస్యగా మారింది. మిల్లర్లు లెవీ కోటా పూర్తి చేయకుండా తమ వద్ద ఉంచుకున్న ధాన్యం కోసమే ప్రభుత్వం వేలం నిర్వహించింది. 2023–24 యాసంగి కోటాలో 69 శాతాన్ని మిల్లర్లు పూర్తి చేశారు. ఈ కోటా పూర్తి చేయడానికి ప్రస్తుతానికి సమయమున్నా 2022–23 యాసంగి బకాయిలు మిల్లర్లను వెంటాడుతున్నాయి.




**బాధ్యులపై చర్యలకు మీనమేషాలు**

లెవీ కోటా భర్తీలో నిర్లక్ష్యం వహించిన మిల్లర్లపై చర్యలకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో ఏటికేడు బకాయిలు పెరిగిపోతున్నాయి. 2018–19లో కేటాయించిన ధాన్యాన్ని అమ్ముకున్న 42 మంది మిల్లర్లను గుర్తించిన అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారు. అందులో కొందరు డబ్బులు చెల్లించడంతో నిషేధం ఎత్తివేశారు. 2019–20, 2020–21 కరోనా సీజన్, 2021–22లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం ముదిరి లెవీ బియ్యం తీసుకోవడంలో జాప్యం జరిగింది. అప్పటి నుంచి తమ వద్ద పేరుకుపోయిన ధాన్యం అమ్ముకున్న మిల్లర్లపై కనీస చర్యలు లేకపోవడంతోనే ఏటా బకాయిల వసూళ్ల కోసం ప్రభుత్వం సమీక్షలు నిర్వహించడం పరిపాటిగా మారింది.

**కేటాయింపుల్లో వివక్ష**

తమకు కేటాయించిన ధాన్యంలో వంద శాతం లెవీ కోటాను పూర్తి చేసిన మిల్లర్లు జిల్లాలో అతి స్వల్పంగా ఉన్నారు.

ప్రతి సీజన్‌లో ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మరాడించి బియ్యం ఇవ్వడానికి మరుసటి ఏడాది సీజన్ ప్రారంభం వరకు మిల్లర్లకు సమయం ఉంటుంది. గడిచిన వానాకాలం(2022–23)లో జిల్లాలో 96 శాతం సీఎంఆర్ కోటా పూర్తయింది. ఇదే స్థాయిలో 2023–24 వానాకాలానికి కేటాయింపులు జరగాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా జిల్లాలోని 55 శాతం మిల్లులకే కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2022–23 యాసంగి కోటా పూర్తి చేయడానికి ఈ నెలాఖరు వరకు గడువుంది. ఆ సీజన్‌కు సంబంధించి బకాయి పడిన ధాన్యానికి ప్రభుత్వం బహిరంగ వేలం నిర్వహించడంతో బియ్యం కోటా పూర్తి చేయాల్సిన బాధ్యత మిల్లర్లపై లేకుండా పోయింది. బియ్యం అప్పగింతకు వేలంలో దక్కించుకున్న సంస్థలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో 216 మిల్లులుంటే కేవలం 120 మిల్లులకే ప్రస్తుత సీజన్‌లో కేటాయించడం వివాదాస్పదమైంది. ఇందులో రారైస్(పొడి బియ్యం) మిల్లులు 16 మాత్రమే కావడం గమనార్హం.

# ఆక్రమణలు తొలగితేనే ఏటీసీకి స్థలం

సిరిసిల్ల : మారుమూల ప్రాంతంలో ప్రభుత్వ విద్యాసంస్థను ఏర్పాటు చేసి అక్కడి యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంచాలని వేములవాడ డివిజన్ రుద్రంగి మండల కేంద్రానికి ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఉత్తర్వులో చూపించిన సర్వే నంబరులో రెవెన్యూ అధికారులు పరిశీలించగా ఆ స్థలంలో ఇప్పటికే నిర్మాణాలు ఉన్నాయి. ఏటీసీ నిర్మాణానికి పది ఎకరాలు అవసరం. కేజీబీవీ పక్కనున్న స్థలాన్ని పరిశీలించగా అది కూడా ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని తొలగిస్తే తప్ప స్థల కేటాయింపులు జరిగేలా లేవు. దీంతో పాటు ఇప్పటికే రుద్రంగి మండలానికి ముప్పై పడకల ఆసుపత్రి కూడా మంజూరైంది. దీని నిర్మాణానికి ఎకరా పైగా స్థలం అవసరం ఉంది.

**ఆరు కోర్సులకు అవకాశం**

రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఏటీసీలో ప్రవేశాలకు అవకాశం ఉంది. ఈ సెంటర్‌లో రెండేళ్ల కాలపరిమితితో ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. అడ్వాన్స్ సీఎన్‌సీ, అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైన్ ఇన్ మెకానికల్, ఇండస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చర్ టెక్నీషియన్, ఎలక్ట్రానిక్ వాహనాల మెకానిక్, మాన్యుఫ్యాక్చర్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులకు 244 సీట్లు ఉన్నాయి. స్థల కేటాయింపు కొలిక్కి రావాలి. అప్పుడు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని బదలాయిస్తూ ఉపాధి శిక్షణ మండలికి పంపాలి. దాని ఆధారంగా వారు నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందిస్తారు. ఇవి పూర్తయితే శిక్షణకు అవసరమైన పరికరాలు, ఇతర సామగ్రిని అందుబాటులోకి తెస్తారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని ఇప్పటికే విప్ ఆది శ్రీనివాస్ జిల్లా అధికారులకు సూచించారు.

**యువతకు వరం**

జిల్లాలో రుద్రంగి మండల పరిధిలోనే ఎక్కువగా గిరిజన తండాలు విస్తరించి ఉన్నాయి. ఇక్కడి యువతలో ఉన్నత చదువులు అంతంత మాత్రమే. చాలా వరకు ఇంటర్ చదువులకే పరిమితమయ్యారు. ఈ చుట్టుపక్కల గ్రామాల్లోని యువకులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. అందులోనూ సరైన నైపుణ్యాలు లేకపోవడంతో అక్కడ కూలీలుగా పని చేస్తుంటారు. ప్రభుత్వం ఏటీసీ కేంద్రం ఏర్పాటుతో వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట, చందుర్తి, కథలాపూర్, భీమారం, మేడిపల్లి మండలాల్లోని యువతలో నైపుణ్యాలు పెరుగుతాయి. ఫలితంగా మెరుగైన ఉపాధి లభించే అవకాశం ఉంది.

**స్థలం సిద్ధంగా ఉంది – ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్**

ఏటీసీకి కేటాయించాల్సిన స్థలాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి తొలగించేందుకు ఆదేశాలిచ్చారు. చదును చేశాక సర్వేయర్‌తో హద్దులు నిర్ధారించాల్సి ఉంది. రెండు చోట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఏటీసీకి, ముప్పై పడకల ఆసుపత్రికి రెండింటికి అవసరమైన స్థలం సిద్ధంగా ఉంది.

# పత్తి రైతుకు మద్దతు కరవు

మోత్కూరు : వర్షాలు, చీడపీడలను ఎదుర్కొని పత్తి పండించిన రైతుకు ఏరివేత కష్టాలు మొదలయ్యాయి. కూలీలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏరిన పత్తిని అమ్ముదామంటే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభంకాకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ధర తగ్గించడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని కర్షకులు దిగులు చెందుతున్నారు.

**కిలో లెక్కన కూలికి డిమాండ్**

పత్తి ఏరేందుకు కూలీలకు రోజుకూలి రూ.300 నుంచి రూ.350 వరకు ఇస్తున్నారు. కొన్నిచోట్ల కిలోలెక్కన కూలి ఇస్తేనే వస్తామని కూలీలు స్పష్టం చేస్తున్నారు. సేకరించిన పత్తి కిలోకు రూ.12 నుంచి రూ.13 వరకు అడుగుతున్నారు. ఇలా రెండు రకాలుగా కూలి ఇద్దామన్నా కొందరు పనికి రావడం లేదు. కిలోకు రూ.15 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పైగా కూలీలను తీసుకెళ్లేందుకు ఆటో, మధ్యాహ్నం శీతల పానీయాలకు ఖర్చు చేయాల్సి వస్తోంది. రైతులంతా ఒకే సమయంలో దూది సేకరిస్తుండటంతో కూలీల కొరత ఏర్పడింది.

**ధర తగ్గించి కొనుగోళ్లు**

కూలీలకు ఎక్కువ కూలి చెల్లించి దూది సేకరించినా సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేక రైతులకు అమ్మకం కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఈ సారి పత్తికి క్వింటాకు మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తామని



ప్రకటించింది. మొదటి విడతలో పత్తి విక్రయించిన రైతులకు ప్రైవేట్ వ్యాపారులు రూ.ఏడు వేల వరకు చెల్లించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఆలస్యం కావడంతో ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ.5,500లకు ధర తగ్గించేశారు. ఒత్తిడి తెస్తే రూ.ఆరు వేలకు కొంటున్నారు. తేమ, నాణ్యత లేదని కోతలు విధిస్తూనే తూకంలో మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పండగ తర్వాత ప్రారంభిస్తాం– ఉమామహేశ్వరరావు, మార్కెట్ కార్యదర్శి, మోత్కూరు

మోత్కూరు ప్రాంతంలో ఆరు పత్తి మిల్లులున్నాయి. వీటిల్లో నవంబరు మొదటి వారంలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తాం. ప్రస్తుతం తేమశాతం అధికంగా ఉంది. అందుకే పండగ తరువాత కొనుగోళ్లు చేపడతాం.

**పొద్దంతా ఏరితే తక్కువ కూలా?**

– వేముల పద్మ, కూలీ, బుజిలాపురం

పత్తి ఏరేందుకు కూలికి పోతే రూ.300 నుంచి రూ.350 వరకే ఇస్తున్నారు. పొద్దంతా ఎండలో ఏరితే తక్కువగా కూలి ఇస్తున్నారని ఎక్కువ మంది రావడం లేదు. కిలోకు రూ.12 నుంచి 15 వరకు ఇస్తేనే వస్తామంటున్నారు. కిలో లెక్కన రోజుకు 40 నుంచి 50 కిలోల దూది ఏరితే గిట్టుబాటు అవుతుంది.నష్టాలే మిగులుతున్నాయి..– బొమ్మగాని లక్ష్మయ్య, రైతు, లక్ష్మీదేవికాల్వవినిమిదెకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరాకు రూ.30 నుంచి రూ.35 వేల దాకా ఖర్చయ్యింది. దిగుబడి ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్లే వస్తోంది. ముసురు వానలకు గూడ రాలిపోయి దిగుబడి తగ్గింది. పత్తి ఏరేందుకు రోజు కూలి రూ.400 ఇస్తామన్నా కూలీలు రావడం లేదు. ఇటు వ్యాపారులూ క్వింటాకు మద్దతు ధరకంటే తక్కువగా రూ.5,900కే కొంటున్నారు. ఈసారి రైతులకు ఏమీ మిగిలే పరిస్థితులు లేవు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిస్తే కొంత ఊరట లభిస్తుంది.

# నాడు ఆహ్లాదం.. నేడు అధోగతి

పాల్వంచ : కేటీపీఎస్ 'ఏ' కాలనీలోని 'విద్యుత్ కళా భారతి' కళతప్పి కనిపిస్తోంది. నిర్వహణను విద్యుత్ సంస్థ అధికారులు పక్కనపెట్టేశారు. తాజాగా జెన్కో క్రీడాపోటీల నేపథ్యంలోనైనా పూర్వ కళ సంతరించుకునేలా ఏర్పాట్లు పునరుద్ధరించాలని పురవాసులు, కేటీపీఎస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు. కేటీపీఎస్ ఉద్యోగులు, వారి కుటుంబాలు వ్యాహ్యాళి, జెన్కో క్రీడా పోటీల నిర్వహణకు దశాబ్దాల క్రితం 'కళా భారతి' మైదానాన్ని పట్టణం నడిబొడ్డున ఏర్పాటు చేశారు. సంస్థకు చెందిన వారే కాకుండా, పురపాలకానికి చెందిన పలు వార్డుల ప్రజలు నడక సాధన, చిన్నారుల ఆటవిడుపు కోసం ఇక్కడకు వస్తుంటారు. సెలవు రోజుల్లో అయితే వీరి సంఖ్య సుమారు వెయ్యి వరకు ఉంటుంది. కొన్నేళ్లుగా మైదానం నిర్వహణపై కేటీపీఎస్ యాజమాన్యం శీతకన్ను వేస్తోంది. వాకింగ్‌కు వచ్చేవారి సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోతోంది. కనీసం కాపలా వంటి ఏర్పాట్లూ లేకపోవడం, రాత్రుళ్లు నిర్మానుష్యంగా ఉంటుండటంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. కొందరు అసాంఘిక కార్యకలాపాలకూ వేదికగా వాడుకుంటున్నారు. ఆవరణంలో పెరిగే పచ్చిక కోసం వచ్చే పశువుల తాకిడి ఎక్కువైంది. మరోవైపు శునకాల సంచారం నడక సాధకులను బెంబేలెత్తిస్తోంది. లక్షకు పైగా జనాభా గల పట్టణంలో ఉదయం, సాయంత్రం నడకకు ఎక్కువ సంఖ్యలో కళాభారతికి వస్తుంటారు. వచ్చేనెల 7వ తేదీ నుంచి టీజీ జెన్కో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. కనీసం మైదానాన్ని శుభ్రం చేసి.. ఆటసామగ్రికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

**కాపలాదారుణ్ని నియమించాలి**

పట్టణం నడిబొడ్డున ఉన్న మైదానానికి గతంలో వేలాది మంది తరలివచ్చేవారు. రాన్రాను ఏర్పాట్లు, నిర్వహణపై దృష్టి తగ్గింది. కనీసం కాపలా అంటూ ఏమీ లేక కొందరు మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కనీసం సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేస్తే రక్షణ, నిర్వహణకు వెసులుబాటు లభించవచ్చు. మరిన్ని సదుపాయాలు కల్పిస్తే పూర్వ వైభవం వస్తుంది.– దుర్గాప్రసాద్, పాల్వంచ

వసతులు కల్పిస్తే బాగు – రవీందర్, స్థానికుడు

ఉద్యోగులు, స్థానికులు వందలాది మంది మానసిక ఉల్లాసం కోసం రెండు పూటలూ తరలివస్తారు. ఉద్యోగాలకు సిద్ధమయ్యే కొందరు యువత వ్యాయామాలు, పరుగు సాధన చేస్తుంటారు. పిల్లల ఆటసామగ్రితో పాటు మరిన్ని వసతులు కల్పిస్తే మరింత ప్రయోజనం ఉంటుంది.

నిరుపయోగంగా పిల్లల ఆట సామగ్రి

కళాభారతి సమస్యలను కేటీపీఎస్ సివిల్ ఈఈ రాజీవ్ దృష్టికి తీసుకెళ్లగా.. మైదానం పరిశుభ్రతకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. వసతులు కల్పించాలన్న పురవాసులు డిమాండ్‌ను పరిశీలిస్తామని చెప్పారు.

# ఆదాయం ఘనం.. వసతులు గగనం




హుజూరాబాద్ : ఒకటి, రెండు కాదు ఏకంగా ఆరు మండలాలకు చెందిన ప్రజలకు మోటారు వాహనాల తనిఖీ అధికారి యూనిట్ కార్యాలయం(ఎంవీఐ)సేవలందిస్తుంది. కానీ కార్యాలయానికి శాశ్వత భవనం మాత్రం లేదు. ఉన్న అద్దె భవనం సైతం శిథిలావస్థకు చేరింది. సరైన వసతులు లేకపోవటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హుజూరాబాద్ మోటారు వాహనాల తనిఖీ అధికారి యూనిట్ కార్యాలయం(ఎంవీఐ)పైకథనం..

**ఆరు మండలాల వాహనదారులకు**

హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధి కేసీ క్యాంపులో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటుచేశారు. హుజూరాబాద్‌తోపాటు జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, సైదాపూర్, శంకరపట్నం మండలాలకు సంబంధించి.. ప్రతినెలా సుమారు 1500 నుంచి 1800 మంది వాహనదారులకు సేవలందుతున్నాయి. ప్రభుత్వానికి ప్రతినెలా ఆదాయం రూ.లక్షల్లోనే సమకూరుతుంది. ఈ కార్యాలయంలో ఎంవీఐతో పాటు జూనియర్ అసిస్టెంట్, కానిస్టేబుల్, హోంగార్డు విధులను నిర్వర్తిస్తున్నారు.

**శిథిలావస్థలో అద్దె భవనం**

హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధి కేసీ క్యాంపులోని ఎస్సారెస్పీ క్వార్టర్‌లో ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. గోడలు బీటలు వారగా.. తలుపులకు పగుళ్లు ఏర్పడ్డాయి. చినుకుపడితే చాలు కార్యాలయ గోడలు పదునెక్కుతున్నాయి. రెండు గదులు జలమయంగా మారుతున్నాయి. ప్రతినెలా అద్దె, విద్యుత్తు, మంచినీరు కలిపి రూ.2625లు చెల్లిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే సిబ్బంది విధులను నిర్వర్తిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేయించినప్పటికీ.. పగుళ్లు ఏర్పడుతూనే ఉన్నాయి. చలువ పందిళ్లతో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేయగా.. అది ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ చిరిగిపోయింది.

**అందించే సేవలు ఇవి..**

నూతన లైసెన్స్‌లు జారీ చేయటం
నాన్ ట్రాన్స్‌పోర్టు కింద వాహనాలకు నెంబర్లు కేటాయించటం
వాహనాల సామర్థ్య పరీక్షలు నిర్వహించటం
లైసెన్స్‌లను రెన్యూవల్ చేయటం
డ్రైవర్లకు బ్యాడ్జి లైసెన్స్‌లను జారీ చేయటం
వాహన యజమానుల పేరు మార్పిడి
ప్రధాన రహదారులపై వాహనాల తనిఖీ
మౌలిక సదుపాయాలు లేవు

– సిహెచ్.రేవంత్, హుజూరాబాద్ఆరు మండలాలకు సేవలందిస్తున్న కార్యాలయానికి శాశ్వత భవనం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. వాహనానికి సంబంధించిన పనికోసం ఇక్కడికి వచ్చాను. సేవలు బాగానే ఉన్నా.. మౌలిక సదుపాయాలు లేవు. వెంటనే శాశ్వత భవనాన్ని నిర్మించాలి. **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం–** కె.వేణు, ఎంవీఐ, హుజూరాబాద్కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి.. జాప్యం లేకుండా సేవలందిస్తున్నాం. వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం. ప్రస్తుతం ఉన్న వసతులను వినియోగిం చుకుంటున్నాం. శాశ్వత భవనం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

# ఈవీకి మళ్లుదామా!



పెద్దపల్లి : వాయు కాలుష్యం తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది.. ఈ క్రమంలో ఈ వాహనాలకు ఉచిత రిజిస్ట్రేషన్‌కు ఆదేశాలిచ్చింది.. పెరిగిన పెట్రోల్ ధరలతో ప్రజలు కూడా ఈ వాహనాల వైపు చూస్తున్నారు.. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 6 వేలకు పైగా ఈవీలు ఉండగా ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే వాహనదారులకు ఆర్థిక లాభం చేకూరనుండగా.. పరిసరాలకు కాలుష్యం దూరం అవుతుంది..

**అన్ని రకాలకు వర్తింపు**

గతంలో వంద సీసీ కన్నా తక్కువ సామర్థ్యమున్న ద్విచక్ర వాహనాలకు ఉచిత రిజిస్ట్రేషన్ సదుపాయం ఉంది. కొత్త పాలసీలో అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు అవకాశం కల్పించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, గూడ్స్, బస్సులు అన్నింటి రిజిస్ట్రేషన్ రుసుము ఉచితం. గతంలో రెండో వాహనం కొంటే 2 శాతం పన్ను ఉండేది. ఈవీ రెండో వాహనమైతే పన్ను ఉండకపోవడం చాలామంది వాహనదారులకు ఊరట కలిగించేదే. ఈ విధానం 31 డిసెంబరు 2026 వరకు అమలులో ఉండనుంది.

**పెరగనున్న విక్రయాలు**

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానంతో విద్యుత్తు వాహనాల విక్రయాలు పెరగనున్నాయని భావిస్తున్నారు. రూ.లక్ష విలువ చేసే ద్విచక్ర వాహనం కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్, ఇతర ఛార్జీలకు కనీసం రూ.10 వేలు ఖర్చవుతుంది. అదే ఈవీలు కొంటే ఛార్జీల భారం తగ్గనుంది. ద్విచక్ర వాహనానికి రోజుకు కనీసం 5 గంటల ఛార్జింగ్ పెడితే 3 యూనిట్ల కరెంట్ ఖర్చు కానుంది. ఈ లెక్కన యూనిట్‌కు రూ.6 చొప్పున రూ.18 ఖర్చయితే వంద కి.మీ.ల దూరం ప్రయాణించవచ్చు. పెట్రోల్ వాహనం అయితే రూ.180 ఖర్చు అవుతుంది.

**ఉమ్మడి జిల్లాలో 6,966 వాహనాలు**

ఉమ్మడి జిల్లాలో 6,966 ఈవీలు ఉన్నాయి. వీటిలో ద్విచక్ర వాహనాలు 6,582, కార్లు 165, క్యాబ్‌లు 4, ఆటోలు 86, బస్సులు 41, త్రీవీలర్స్ 88 చొప్పున ఉన్నాయి. ఇటీవల కరీంనగర్‌లో ఆర్టీసీ ఈవీ బస్సు సేవలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ఈవీ ఛార్జింగ్ కేంద్రాల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. తెలంగాణ ఇంధన వనరుల పునరుత్పాదక సంస్థ ఆధ్వర్యంలో పది చోట్ల నెలకొల్పేందుకు స్థల సేకరణలో నిమగ్నమయ్యారు.

**ఉత్తర్వులు వచ్చాయి** పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఈవీ వాహనాలకు ఉచిత రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉత్తర్వులు ఇచ్చింది. కొనుగోలు చేసిన వాహనదారులు కార్యాలయానికి వస్తే ఎలాంటి రుసుము లేకుండానే జీరో రిజిస్ట్రేషన్ చేస్తాం. వినియోగదారులు రాయితీ సదుపాయాన్ని వినియోగించుకోవాలి.రంగారావు, రవాణా శాఖ జిల్లా అధికారి, పెద్దపల్లి

# కు.ని.పై అపోహలెందుకు?

వికారాబాద్ : జిల్లాలో కుటుంబ నియంత్రణ (కు.ని) ఆపరేషన్ల పట్ల పురుషులు పూర్తిగా విముఖం వ్యక్తం చేస్తున్నారు. ఇది చాలా ఆందోళనకరమైన విషయమని అధికారులు పేర్కొంటున్నారు. గత రెండేళ్ల ఆపరేషన్ల తీరు గమనిస్తే ఒక్క పురుషుడు కూడా కు.ని. చేయించుకున్న జాబితాలో లేకపోవడం విస్మయం కలిగిస్తోందంటున్నారు. ఇందుకు కారణం.. వారిలో ఉన్న ఒక విధమైన భయం, అపోహలే కారణమని వివరిస్తున్నారు. ఇలాంటి తరుణంలో తాజాగా జిల్లా వ్యాప్తంగా పక్షోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో కు.ని.అవసరం, మహిళల ఆరోగ్యం అంశాలపై కథనం.

**డిసెంబర్ 4 వరకు పక్షోత్సవాలు**

వ్యాసెక్టమి పక్షోత్సవాలను వచ్చే నెల 4 వరకు 15 రోజులపాటు నిర్వహించే కార్యక్రమానికి ఇటీవలే శ్రీకాం చుట్టారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఊరేగింపుల ద్వారా కు.ని.ఆపరేషన్లపై ప్రచారం చేస్తారు. ఈసారి పురుషులు ఆపరేషన్లు చేసుకునేలా ముమ్మరంగా ప్రచారం చేసి వారిని ఒప్పించాలని చూస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని మారు మూల ప్రాంతాల్లో సైతం ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

**ఇవి తెలుసుకోవాలి**

కు.ని. ఆపరేషన్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. 20 నిమిషాల్లో పూర్తవుతుంది. మరో 10 నిమిషాలు ఆసుపత్రిలో ఉంచి ఇంటికి పంపిస్తారు. సైకిల్ తొక్కుకుంటూ కూడా ఇంటికి వెళ్లవచ్చు. లైంగిక సామర్థ్యం తగ్గుతుందనేది అపోహ మాత్రమే. ః ఆరోగ్యం,



శారీరక పటుత్వం సన్నగిల్లుతుందనేది అవాస్తవం.

**వైద్యాధికారులకు వివరించాం - డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి, వికారాబాద్.**

జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో వ్యాసెక్టమిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించాం. అపోహలను తొలగించి మగవారిని సంసిద్ధం చేయాలని కోరాం. ప్రతి కేంద్రం నుంచి ఒక్కరినైనా ఆపరేషన్ చేసుకోనేలా చూడాలని తెలిపాం.


**పురుషులు బాధ్యత తీసుకోవాలి- డాక్టర్ పవిత్ర, కుటుంబ నియంత్రణ కార్యక్రమ అధికారిణి, వికారాబాద్.** కు.ని. ఆపరేషన్లను కేవలం ఒక్క మహిళలకే అనే అపోహలో ఉండకుండా పురుషులు కూడా బాధ్యత తీసుకోవాలి. ఆపరేషన్ అనంతరం ఆరోగ్యం బాగుంటుంది. ఎలాంటి నష్టం కలగదని గుర్తించాలి.

# సర్కారు జాగా.. వేసేద్దాం పాగా

హైదరాబాద్ : మహానగరం పరిసర ప్రాంతాల్లో ఖరీదైన సర్కారు భూములు ఖాళీగా ఉండటంతో కొందరు అక్రమార్కులు వాటిని సొంతం చేసుకునేందుకు సరికొత్త వ్యూహాలు రచిస్తున్నారు. వాటిని విక్రయించేప్పుడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తెలివిగా.. ప్రభుత్వ భూముల పక్కనే ఉన్న ప్రైవేటు పట్టా భూముల సర్వే నంబర్లకు బై నంబర్లు వేసి విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌లోని షేక్‌పేట, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, గండిపేట్, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ మండలాల్లో కొద్దిరోజులుగా కొనసాగుతున్నాయి. రెవెన్యూ విభాగంలో కొందరు అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సహకారంతో కొందరు రూ.వందల కోట్ల విలువైన స్థలాలను ఆక్రమించుకుంటున్నారు.

**కొండలనూ తొలిచేస్తున్నారు..**

షేక్‌పేట్ మండలం బంజారాహిల్స్‌లో వినాయక్‌నగర్, బండారు బాల్‌రెడ్డినగర్, దీన్‌దయాళ్ నగర్‌లలో పదెకరాల ప్రభుత్వ భూములపై కొందరు అక్రమార్కుల కన్నుపడింది. అక్కడ కొండలు, గుట్టలు ఉన్నా వాటిని చదును చేసి విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదే ప్రాంతాల్లో నిరుపేదలకు కేటాయించిన రెండు పడకగదుల స్థలాలు కబ్జా చేస్తున్నారు. అక్కడున్న పదెకరాల స్థలంలో మూడు



ఎకరాలను పూర్తిగా స్వాధీనం చేసుకుని ప్లాట్లుగా విభజించి కొద్దిరోజుల నుంచి విక్రయాలు చేపట్టారు. కొనుగోలు చేస్తున్నవారికి విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తామంటూ హామీ ఇస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు నిర్మాణాలు సైతం చేపట్టారు. ఓ రెవెన్యూ అధికారి వారి వద్ద నుంచి రూ.లక్షల్లో ముడుపులు తీసుకోవడంతో పాటు ఆక్రమణలపై సర్కారు తరఫున చర్యలు తీసుకోకుండా అండగా ఉంటానంటూ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**రిజిస్ట్రేషన్లు... మ్యుటేషన్ల మాయ..**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లను తెరపైకి తీసుకొస్తున్నారు. ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయకూడదంటూ అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు జాబితాలు పంపినా.. సర్కారు స్థలాల పక్కనే ఉన్నాయంటూ వాటిని రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. తాజాగా శంషాబాద్ మండలం తొండుపల్లిలో రెండు ఎకరాలను విక్రయించారు. శేరిలింగంపల్లి మండలంలో 12 ఎకరాలను వేరే సర్వే నంబర్ పేరుతో కొద్దినెలల క్రితం రిజిస్ట్రేషన్ చేయించారు. గండిపేట్ మండలంలో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏకంగా ధరణి పోర్టల్‌లో ప్రైవేటు వ్యక్తుల పేర్లతో నమోదు చేయించుకున్నారు.

# పురపాలికకు అమృత్

సిరిసిల్ల : జిల్లా కేంద్రం రోజురోజుకు విస్తరిస్తోంది. పాత భగీరథ పథకంలో తాగునీటిని సరఫరా చేస్తున్నా దాని పూర్తి లక్ష్యం నెరవేరలేదు. పురపాలికలోని ఏడు విలీన గ్రామాలకు ఏటా తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. పట్టణ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల నీటిని అందించేలా ప్రణాళికలు చేశారు. అమృత్‌లో చేపడుతున్న నిర్మాణాలతో పురపాలికలో తాగునీటికి శాశ్వత పరిష్కారం లభించనుంది.

సిరిసిల్ల పురపాలికలో రెండో బాహ్యవలయ రహదారి నిర్మాణంతో భగీరథ ప్రధాన, ఇంట్రావిలేజ్ పైపులైను వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీనికితోడు పాత పైపులైనుకే భగీరథ ప్రధాన పైపులైను అనుసంధానం చేయడంతో నీటి ప్రవాహ వేగం, ఒత్తిడి కారణంగా తరచూ పైపులు పగులుతూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో కాలనీల్లో తరచూ మురుగు సరఫరా అవుతోంది. సిబ్బంది ఎప్పటికప్పుడు లీకేజీలను గుర్తించడం, వాటిని మరమ్మతులు చేసి సరఫరా చేసేందుకు సమయం పడుతుంది. ఈ లోపు కాలనీల్లో నీటి సమస్య తీవ్రమవుతోంది. లీకేజీలు, పైపులైను వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎత్తున ఉన్న శివారు కాలనీలకు తాగునీరు అందడం లేదు. పురపాలికల్లోని కాలనీలకు పూర్తిస్థాయిలో తాగునీరందించేందుకు కేంద్రం అమృత్ 2.0లో సిరిసిల్ల పురపాలికకు రూ.104.25 కోట్లు కేటాయించింది. ఇటీవలే టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పనులు ప్రారంభమయ్యాయి.

**చేపట్టే పనులు**

సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట, రగుడు, చిన్నబోనాల, పెద్దబోనాల, సర్దాపూర్, రాజీవ్‌నగర్, ముష్టిపల్లి ఏడు విలీన గ్రామాలు ఉన్నాయి. భగీరథ ఇంట్రావిలేజ్ పనులు అసంపూర్తిగా వదలడం, మరోవైపు చాలా కాలనీల్లో ఇంటింటి నల్లా కనెక్షన్లు లేవు. చాలా చోట్ల లీకేజీలతో నీటి సరఫరా కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. సిరిసిల్ల పాత పట్టణం పరిధిలోనూ కొత్తగా శాంతినగర్, పద్మానగర్, సాయినగర్‌లోని 14 ఎంఎల్‌డీల సామర్థ్యం ఉన్న ట్యాంకులకు చెందిన పాత పైపులైను వ్యవస్థకే భగీరథను అనుసంధానించారు. కాలనీల్లో మాత్రం కొత్త పైపులైనుతో ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇచ్చారు.

పాత పైపులైనులో ఫ్లోరైడ్ పేరుకుపోయి ఉండటంతో నీటి సరఫరాకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీనికితోడు సిరిసిల్ల–కామారెడ్డి బాహ్యవలయ రహదారి నిర్మాణంతో విలీన గ్రామాలకు వెళ్లే తాగునీటి ప్రధాన పైపులైను తొలగించారు. తిరిగి ఏర్పాటు చేయడంతో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో నీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుంది.

కొత్తగా చేపట్టబోయే పనుల్లో భాగంగా 14 కాలనీల్లో కొత్తగా ట్యాంకులను నిర్మించనున్నారు. పాత పైపులైను స్థానంలో కొత్తగా 115 కిలోమీటర్ల మేరకు కొత్త పైపులైను ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా ఎనిమిది వేల నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నారు.

నిధుల వ్యయం: రూ . 104.25 కోట్లు
నిర్మించే నీటి ట్యాంకులు: 14
నిర్మాణం చేపట్టనున్న పైపులైను పొడవు: 115 కిలోమీటర్లు
కొత్త నల్లా కనెక్షన్లు: 8000

సకాలంలో పూర్తికి చర్యలుగుత్తేదారు పనులు పూర్తిచేసేందుకు ఏడాదిన్నర సమయం ఉంది. ఈ లోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

వరుణ్, ప్రజారోగ్యశాఖ డీఈ




అమరావతి: రాజమహేంద్రవరం పేపర్ మిల్లు కార్మికులకు అన్యాయం జరగనివ్వనని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. పేపర్ మిల్లు కార్మికుల వేతన సవరణ విషయమై భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ తదితరులు సీఎంను కలిశారు. పేపరు మిల్లు యాజమాన్యం, కార్మికులకు మధ్య ఉన్న సమస్య వివరాలను నేతలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వేతన సవరణ సమస్యకు పరిష్కారం దొరికేలా చూడాలని కోరారు. సమస్యను పరిష్కరించి కార్మికులకు అన్యాయం జరగకుండా చూస్తానని నేతలకు సీఎం చంద్రబాబు హామీఇచ్చారు.

## విజన్-2047పై ముందుకే.. వెనకడుగు వేసేది లేదు: సీఎం చంద్రబాబు




విజయవాడ: విజయవాడ పటమటలోని దత్త పీఠాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామితో చంద్రబాబు సమావేశమయ్యారు. సీఎంకు స్వాగతం పలికిన గణపతి సచ్చిదానంద స్వామి.. తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం రాష్ట్రంలోని 42 ప్రాంతాల్లో చేపట్టబోయే దత్త క్షేత్రనాథ్ యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "స్వామీజీని దర్శించుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా. సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నా. సమాజహితం కోసమే సచ్చిదానంద పనిచేస్తున్నారు. నా కష్టాలు తొలగాలని పూజలు చేసి నాకు ప్రసాదం అందించారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం. ఉమ్మడి రాష్ట్రంలో విజన్-2020 ప్రకటిస్తే చాలా మంది తప్పుబట్టారు. కానీ ఆ విజన్ ఫలితాలు ఇవాళ అందరికీ కనిపిస్తున్నాయి. ఇప్పుడు విజన్-2047 గురించి ఆలోచిస్తున్నాం. సంపద రావాలి.. ప్రజలు సంతోషంగా ఉండాలి. ఈ విషయంలో ముందుకు వెళ్లడమే తప్ప వెనకడుగు వేసేది లేదు. ఆధ్యాత్మిక భావన మనలో ఉండాలి. ఎప్పుడూ యథార్థాన్ని చెప్పే పరిస్థితిలో మనం ఉండాలి. భగవంతుడి ఆశీస్సులు కూడా తోడుగా ఉండాలి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలి. పేదరికం పూర్తిగా పోవాలి. ప్రజలు సంతోషంగా ఉండాలని నేను కోరుకుంటున్నా. ఆ దిశగా కృషి చేస్తాం. ప్రజలు నాపై నమ్మకం పెట్టుకోవాలి.. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర వైపు తీసుకెళ్లే బాధ్యత నేను తీసుకుంటాను" అని చంద్రబాబు అన్నారు. గణపతి సచ్చిదానందస్వామి మాట్లాడుతూ.. "కృష్ణానది ఒడ్డున జరిగిన సభను మర్చిపోలేను. చంద్రబాబు కర్మ యోగి.. ఆయన సంకల్పించిన పనులు నిర్విఘ్నంగా జరుగుతాయి. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండటమే కాకుండా స్వర్ణాంధ్ర సాకారం కావడం తథ్యం. ఆయనకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నా" అని తెలిపారు.

## నాకు అద్దాల మేడ లేదు.. పేదల కోసం కోట్ల ఇళ్లు నిర్మించాం : మోదీ



దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. దిల్లీ డెవలప్‌మెంట్ అథారటీ ఆధ్వర్యంలో నిర్మించిన పలు నివాస సముదాయాలను ప్రారంభించిన ఆయన.. ఇటీవల చోటుచేసుకున్న సీఎం అధికారిక నివాసం పునరుద్ధరణ వివాదాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని, కానీ.. తానేమీ అద్దాల మేడ కట్టుకోలేదన్నారు. ఈ సందర్భంగా అధికార పార్టీని విపత్తుగా పేర్కొన్న మోదీ.. ప్రజలకు సౌకర్యాలను కల్పించడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందన్నారు. "మోదీ తన కోసం ఇల్లు కట్టుకోలేదన్న విషయం దేశం మొత్తానికి తెలుసు.

అయినప్పటికీ గత పదేళ్లలో పేదల కోసం 4 కోట్ల ఇళ్లను నిర్మించి వారి కలలను సాకారం చేశాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆప్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన మోదీ.. లిక్కర్, స్కూల్, పొల్యూషన్ స్కామ్‌లకు పాల్పడ్డారని ఆరోపించారు. బహిరంగంగానే అవినీతికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. గత పదేళ్లుగా దిల్లీని ఓ విపత్తు చుట్టు ముట్టిందని.. ప్రజలు దానికి వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధమయ్యారని అన్నారు.

## మెడికల్ పీజీ కౌన్సెలింగ్ వివాదం.. మంత్రి సత్యకుమార్ ఏమన్నారంటే..



గుంటూరు: ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌ను ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఇవాళ సందర్శించారు. ఈ సమయంలో మంత్రికు నిరసన సెగ తాకింది. మెడికల్ పీజీ కౌన్సెలింగ్‌లో అక్రమాల పై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్‌లో లోపాలు మంత్రికి చెప్పుకునేందుకు తల్లిదండ్రులు వచ్చారు. సమస్య చెబుతున్న వినకుండా మంత్రి సత్య కుమార్ ముందుకు వెళ్లిపోయారు. మంత్రి సత్యకుమార్ తీరుపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. వైద్యశాఖ నిర్లక్ష్యంతో మెడికల్ విద్యార్థులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పందించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. అయితే మెడికల్ పీజీ కాలేజ్ కౌన్సెలింగ్ వివాదంపై మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందించారు. జగన్ ప్రభుత్వం నిర్వాకం వల్లే మెడికల్ పీజీ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కోర్టు తీర్పుల వల్లే పీజీ విద్యార్థులు ఇబ్బందులు ఏదుర్కొంటున్నారని అన్నారు.


గత వైసీపీ ప్రభుత్వం వేసిన కమిషన్ అనేక విషయాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు, శాస్త్రీయ అంశాలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి మేలు జరుగుతుందో చూస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. వైద్య శాఖలో ఖాళీలను భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

**అవయవ దానంపై ముందుకు రావాలి..** పేదలను మభ్యపెట్టి అవయవాలు తీసుకునే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. అవయవ దానంపై మెడికల్ కళాశాల్లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. అవయువ దానంపై ప్రజల్లో అవగాహన తీసుకురావడం అభినందనీయమని ప్రశంసించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రోజుకు 5 బ్రెయిన్ డెడ్ కేసులు వస్తున్నాయని చెప్పారు. అవయవ దానం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

## అర్జీల పరిష్కారంలో మొక్కుబడిగా పని చేయొద్దు: మంత్రి అనగాని

అమరావతి: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి చాలా ముఖ్యమని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సదస్సుల్లో అర్జీల పరిష్కారంపై వారు సంతృప్తిగా లేరని చెప్పారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోన్ 2, జోన్ 3 జిల్లా కలెక్టర్లు, జేసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడారు. "ఇప్పటివరకు పరిష్కరించిన అర్జీల్లో సగం మంది అర్జీదారులు అసంతృప్తిగా ఉన్నారు. అర్జీల పరిష్కారంలో మొక్కుబడిగా పనిచేయడం మానుకోవాలి. పరిష్కరించగలిగిన అర్జీలను కూడా సకాలంలో పూర్తిచేయడం లేదు. ఈవిషయంపై సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు" అని అనగాని సత్యప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోదియా మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖ



పనితీరుపై అసంతృప్తి చాలా ఉంది. ఈ శాఖకు ప్రస్తుతం సర్జరీ అవసరమన్నారు. ఉద్యోగులు ట్రెడ్‌మిల్‌పై పరిగెడుతున్నట్లు ఉన్నారే కానీ, గమ్యం మాత్రం చేరడం లేదని వ్యాఖ్యానించారు.




## వైకాపా సర్కారు తప్పులను తిరిగి జరగనివ్వం: మంత్రి నిమ్మల

విజయవాడ: కొల్లేరు నుంచి ఉప్పుటేరు కలిసేచోట పూడిక పెరిగిపోతోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుడమేరు వరద నియంత్రణపై మంత్రి నారాయణతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో విజయవాడకు వరద సమస్య లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఇందులో చర్చించారు. ప్రజలకు ఇబ్బందిలేకుండా వరద నియంత్రణ చర్యలు చేపట్టడం గురించి సమాలోచనలు చేశారు. బుడమేరు, కృష్ణా నదికి ఒకేసారి వరద వస్తే ఏం చేయాలన్న దానిపై చర్చించారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఉప్పుటేరు పూడిక తీసే అంశంపై అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మొత్తం 5 అంశాలపై వారికి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నెలాఖరులోపు దీనికి సంబంధించిన నివేదిక తయారుచేయనున్నారని తెలిపారు. వరదల సమయంలో సీఎం చంద్రబాబు సహా అతా కష్టపడి పనిచేశారని వివరించారు. వరదలు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. వైకాపా సర్కారు చేసిన తప్పులు భవిష్యత్తులో పునరావృతం కాకూడదన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని నిమ్మల రామానాయుడు చెప్పారు. "బుడమేరు వరద వల్ల విజయవాడకు తీవ్ర నష్టం జరిగింది. విజయవాడను కాపాడుకోవడంపై అవగాహనకు వచ్చాం. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు కలిసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. కేంద్రం సాయం తీసుకుని నిధులు సమీకరించాలని నిర్ణయం తీసుకున్నాం. బుడమేరు పాత కాలువ సామర్థ్యం 3 వేల క్యూసెక్కులకు పెంచాలి. సామర్థ్యం పెంచేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆదేశించాం. సమాంతరంగా కొత్త కాలువ తవ్వేందుకు కూడా అంచనాలకు ఆదేశించాం. ఉప్పుటేరు మార్గాన్ని వెడల్పు చేయడం మరో కార్యాచరణ. వీటన్నింటిపై ఈ నెల 18న మరోసారి సమావేశం నిర్వహిస్తాం. ప్రతిపాదనలు సీఎంకు సమర్పించి తదుపరి కేంద్రానికి పంపిస్తాం. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యమే బుడమేరు ముంపునకు కారణం. తర్వలోనే సమగ్ర నివేదికను సీఎం చంద్రబాబుకు సమర్పిస్తాం. ఆయన సూచనలకు అనుగుణంగా బుడమేరు కార్యాచరణ ప్రణాళిక ఉంటుంది" అని నిమ్మల రామానాయుడు తెలిపారు.




బెంగళూరు: మహిళలకు ఉచిత బస్సు పథకంపై ఏపీలోని మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా ఉపసంఘం సభ్యులు కర్ణాటకలో పర్యటిస్తున్నారు. కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి సహా అధికారులతో వారు సమావేశమయ్యారు. ఈ మేరకు బెంగళూరులో కర్ణాటక మంత్రిని ఏపీ మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, అనిత, సంధ్యారాణి కలిశారు. ఆ రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం చేశారు. కర్ణాటక బస్సుల్లో ప్రయాణిస్తూ మంత్రుల కమిటీ వివరాలు అడిగి తెలుసుకుంది.

విశాఖపట్నం, జనవరి 03: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. ఏ1, ఏ2 కన్వేయర్స్ బెల్టులు తెగిపడ్డాయి. ఉద్యోగులు షిఫ్ట్ మారుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కొంత నష్టం జరగనుందని సమాచారం. సుమారు 60 టన్నుల ఉత్పత్తి నాలుగు రోజుల పాటు నిలిచిపోయే అవకాశం ఉందని ప్లాంట్ అధికారులు చెబుతున్నారు. ఇదిలాఉంటే.. ప్రమాదం జరిగిన సమయంలో ఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ బెల్టు ద్వారా బొగ్గు ఐరన్ బోర్డు తరలింపు జరుగుతుంది. కన్వేయర్ బెల్ట్‌లు పడిపోవడంతో సింటర్ ప్లాంట్ ఉత్పత్తి నిలిచిపోయింది. ఇప్పుడిప్పుడే ఫుల్ ప్రొడక్షన్‌తో విశాఖ ఉక్కు పరిశ్రమ నిలదొక్కుకుంటోంది. ఇలాంటి క్రమంలో మళ్లీ ప్రమాదం జరుగడంతో ప్లాంట్ ఎంప్లాయిస్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.







## ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు ప్రమాణస్వీకారం

భువనేశ్వర్: ఒడిశా 27వ గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎం మోహన్ చరణ్ మాఝీ, ప్రతిపక్ష నేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## మహిళల విద్యకు సావిత్రిబాయి ఫులే ఎంతో కృషి: రేణూదేశాయ్



విజయవాడ: మహిళల విద్య కోసం సావిత్రిబాయి ఫులే ఎంతో కృషి చేశారని సినీనటి రేణూదేశాయ్ అన్నారు. సావిత్రిబాయి ఫులే జయంతి సందర్భంగా విజయవాడలో 'భారత చైతన్య యువజన పార్టీ'(బీసీవై) ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. "నేను రాజకీయాలకు దూరంగా ఉంటాను. సావిత్రిబాయి ఫులే జయంతి కార్యక్రమం అని చెబితే వచ్చాను. నేడు అందరి ముందు మాట్లాడుతున్నానంటే దానికి కారణం సావిత్రిబాయి. మహిళల విద్య కోసం ఆమె ఎంతో కృషి చేశారు. పిల్లలు తల్లిదండ్రులు కంటే ఉపాధ్యాయులతోనే ఎక్కువగా ఉంటారు. వాళ్లను సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది" అని రేణూదేశాయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు బ్రహ్మానందం, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, దిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలందిచిన మహిళా టీచర్లకు ఈ కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి కొండపల్లి



విజయనగరం గ్రామీణం: సోనియానగర్‌లో సుమారు రూ. 5.19 కోట్ల తో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆరునెలల పాలనలో కూటమి ప్రభుత్వం అద్భుత ఫలితాలను సాధిం చిందని చెప్పారు. అంతేకాకుండా గ్రీన్ పవర్, సోలార్ పవర్‌పై దృష్టి సారించినట్లు తెలి పారు. అంతేకాకుండా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. కేవలం విద్యుత్ రంగంలోనే కాకుండా రహదారులు నిర్మిస్తున్నామని, త్రాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ.. సోనియానగర్‌లో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ వల్ల టిడ్కో కాలనీతోపాటు, వైఎస్‌ఆర్‌నగర్, గాజులరేగ తదితర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు పి.త్రినాధరావు, పి.హరి, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ డ్రెస్‌లో మత్తెక్కిస్తున్న ఇస్మార్ట్ నభా

'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. ఈ అమ్మడు తెలుగులో ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. మొదటి సినిమాతో నటిగా మంచి పేరు సొంతం చేసుకున్న నభా ఆ తర్వాత సినిమాల్లో అందాల ఆరబోత చేయడం ద్వారా గ్లామర్‌తో మెప్పించింది. మొత్తానికి ఈ అమ్మడు టాలీవుడ్‌లో మంచి కమర్షియల్ హీరోయిన్‌గా నిలిచింది. ఈ అమ్మడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో చేసిన ఇస్మార్ట్ శంకర్ భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో మరింతగా పాపులారిటీ సొంతం చేసుకుంది. కానీ కరోనా వల్ల ఆ సినిమా హిట్‌ను నభా క్యాష్ చేసుకుని మరిన్ని ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అయ్యింది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత పెద్దగా సినిమాల్లో కనిపించని నభా నటేష్ మళ్లీ బిజీ అయ్యింది. ప్రస్తుతం ఆమె చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఈ ఏడాది డార్లింగ్ అనే వెబ్ కంటెంట్‌తో ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన నభా నటేష్ వచ్చే ఏడాదిలో రెండు మూడు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు



ఉన్నాయి. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు సినిమా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. రెగ్యులర్‌గా ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. మరోసారి తన అందమైన ఫోటోలను నభా షేర్ చేయడంతో వార్తల్లో నిలిచింది. అందాల నభా నటేష్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రెడ్ డ్రెస్‌లో నభా థైస్ అందాలను చూపిస్తూ క్లీ వేజ్ షో తో మతి పోగొడుతోంది. కవ్వించే ఆ చూపులకు ఎంతటి వారు అయినా మతి పోయి కింద పడిపోవాల్సిందే అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. సోషల్ మీడియాలో మరోసారి ముద్దుగుమ్మ నభా నటేష్ అందాల ఆరబోత ఫోటోలు వైరల్ కావడం జరిగింది. ఇంతటి అందగత్తెకు ఆఫర్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం విడ్డూరంగా ఉందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలుగులో ఇప్పటి వరకు నభా నటేష్ నన్ను దోచుకుందువటే, అదుగో, ఇస్మార్ట్ శంకర్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో సినిమాలు చేసింది. ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న స్వయంభూ సినిమాలోనూ నభా నటేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగులో ఈమెకు నటిగా, అందాల ఆరబోత విషయంలో పాజిటివ్ మార్కులు దక్కాయి. కానీ లక్ కలిసి రాపోవడంతో ఆఫర్లు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. ముందు ముందు అయినా ఈ అమ్మడికి మంచి ఆఫర్లు దక్కుతాయా అనేది చూడాలి.

# ఫోటో క్రెడిట్ లేదా పుష్పా అంటూ వచ్చేశాడు..!

హనుమాన్ తో పాన్ ఇండియా హిట్ అందుకున్న డైరెక్టర్ ప్రశాంత్ వర్మ హీరో తేజా సజ్జా ఇద్దరు ప్రొఫెషనల్ గానే కాదు పర్సనల్ గా కూడా మంచి ఫ్రెండ్స్. అందుకే వాళ్లిద్దరు కలిసి చేసిన ప్రాజెక్టులు రెండు ఒకటి జాంబి రెడ్డి రెండోది హనుమాన్ హిట్ అయ్యాయి. ఐతే ఆన్ స్క్రీన్ మీద వారి టాలెంట్ తో మెప్పించే వీరు ఆఫ్ స్క్రీన్ పై ఒకరి మీద ఒకరు వేసుకునే పంచులు కూడా ప్రేక్షకులను అలరిస్తున్నాయి. అలా సరదాగా తేజా ఏదో పెట్టడం దానికి ప్రశాంత్ వర్మ కామెంట్ పెట్టడం దానికి తేజా రిప్లై ఇస్తే దానికి ప్రశాంత్ వర్మ కామెంట్ తిరిగి కామెంట్ పెట్టడం ఇలా జరుగుతుంది. లేటెస్ట్ గా అలాంటి ఫన్నీ ట్వీట్ చాట్ జరిగింది. తేజా సజ్జా రణ్ వీర్ సింగ్ తో




కలిసి దిగిన ఫోటోను షేర్ చేస్తూ ఆయన తేజా గురించి చెప్పిన విషయాలను ప్రస్తావించాడు. రణ్ వీర్ లాంటి స్టార్ తనని పొగడటంతో తేజా ఆ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నాడు. ఐతే ఆ ట్వీట్ కు ప్రశాంత్ వర్మ రెస్పాండ్ అవుతూ ఫోటో క్రెడిట్ లేదా పుష్పా అంటూ కామెంట్ పెట్టాడు. దానికి తేజా సజ్జ వచ్చేశాడు అంటూ కృష్ణ సినిమాలో బ్రహ్మానందం జిఫ్ పెట్టాడు. ఐతే దానికి కూడా ప్రశాంత్ వర్మ స్పందిస్తూ మనకు ఏం కావాలన్నా సరే అడిగి తీసుకోవాలని ఒక పెద్దాయన చెప్పాడంటూ కామెంట్ పెట్టాడు. ఈ సరదా సంభాషణలు నెటిజన్లను అలరించింది. ఈమధ్యనే పుష్ప 2 చెన్నై ఈవెంట్ లో దేవి శ్రీ ప్రసాద్ మనకు ఏం కావాలనా సరే అడిగి తీసుకోవాలని చెప్పాడు. ఆయన చెప్పిన సందర్భం ఏమో కానీ తేజా గురించి ప్రశాంత్ వర్మ పెట్టింది మాత్రం ఫన్నీగా ఉంది. ఇక ప్రశాంత్ వర్మ ప్రస్తుతం మూడు సినిమాలతో బిజీ బిజీగా ఉన్నాడు.

జై హనుమాన్ చేస్తూనే మహాకాళి, అధీరా చేస్తున్నాడు. అంతేకాదు నందమూరి వారసు డు మోక్షజ్ఞ తెరంగేట్రం సినిమాను కూడా ప్రశాంత్ వర్మ డైరెక్ట్ చేస్తున్నా డు. హనుమాన్ తో పాన్ ఇండియా లెవెల్ లో తన సత్తా చాటిన ప్రశాంత్ వర్మ రాబోయే సినిమాలతో మరింత క్రేజ్ తెచ్చుకునేలా ఉన్నాడు. తేజ్జా సినిమాల విషయానికి వస్తే జై హనుమాన్ లో చిన్న పార్ట్ అయ్యే ఛాన్స్ ఉండగా కార్తీక్ ఘట్టమనేని డైరెక్షన్ లో మిరాయ్ సినిమాతో భారీ స్కెచ్ వేశాడు. ఈ సినిమా గ్లింప్స్ తోనే సినిమాపై సూపర్ బజ్ ఏర్పడింది.





# గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్.. అమెరికా బుకింగ్స్ ఎలా ఉన్నాయంటే..



సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు టాలీవుడ్ హీరోలు రామ్ చరణ్, బాలకృష్ణ, వెంకటేష్ సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ముందుగా గేమ్ ఛేంజర్ తో చరణ్ వస్తుండగా.. ఆ తర్వాత రెండేసి రోజుల గ్యాప్ లో బాలయ్య డాకు మహారాజ్ తో.. వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాంతో రానున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయా సినిమాల మేకర్స్ పూర్తి చేసేశారు! ఇప్పుడు ప్రమోషన్స్ పైనే ఫోకస్ పెట్టారు. వాటితోనే బిజీగా ఉన్నారు. అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా జరిగేలా ప్లాన్ చేస్తున్నారు. మూవీపై మంచి బజ్ క్రియేట్ అయ్యేలా తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. సంక్రాంతి విన్నర్ గా నిలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. అయితే సంక్రాంతి సినిమాల్లో పాన్ ఇండియా చిత్రాలైన గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ అడ్వాన్స్ బుకింగ్స్ చాలా రోజుల క్రితమే అమెరికాలో ఓపెన్ అయ్యాయి. అమెరికాలో 395 పైగా లొకేషన్స్ లో 1130కుపైగా షోలు గేమ్ ఛేంజర్ కు పడనుండగా.. ఇప్పటి వరకు $380K ప్రీ బుకింగ్స్ జరిగినట్లు ట్రేడ్ పండితులు చెబుతున్నారు. మరోవైపు 125కి పైగా లొకేషన్లలో 340కుపైగా డాకు మహారాజ్ షోస్ పడనున్నాయి. ఓవరాల్ గా ప్రీ బుకింగ్స్ లో ఆ మూవీ ఇప్పటి వరకు $92K వసూలు చేసింది. అయితే గేమ్ ఛేంజర్ రిలీజ్ కు 8 రోజులు ఉండగా, డాకు మహారాజ్ కు 10 రోజులు ఉన్నాయి. కానీ రెండు సినిమాల అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పుడు యావరేజ్ గా జరుగుతున్నాయనే చెప్పాలి. అయితే బుకింగ్స్ లో స్పీడ్ భారీగా పెరగాల్సి ఉంది. అందుకోసం సినిమాలపై మేకర్స్ మరింత బజ్ ను క్రియేట్ చేయాలి. థియేట్రికల్ ట్రైలర్స్ తో ఆడియన్స్ ను అట్రాక్ట్ చేయాలి. వేరే లెవెల్ కట్ తో మెప్పించాలి. అలా రెండు సినిమాల ట్రైలర్ల రిలీజ్ తర్వాత.. బుకింగ్స్ ట్రెండ్ లో గ్రోత్ కచ్చితంగా ఉంటుందని అంతా అంచనా వేస్తున్నారు. ఇక చిత్రాల విషయానికొస్తే.. పొలిటికల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా గేమ్ ఛేంజర్ ను కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ తెరకెక్కించగా.. దిల్ రాజు నిర్మించారు. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా డాకు మహారాజ్ ను బాబీ కొల్లి రూపొందించారు. యంగ్ ప్రొడ్యూసర్ నాగవంశీ నిర్మించారు. మరి ఆ రెండు మూవీస్.. బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయం సాధిస్తాయో వేచి చూడాలి.

# ఊర్వశితో బాలయ్య దబిడి డిబిడి.. ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్..!



నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం "డాకు మహారాజ్". బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశీ రౌతేలా హీరోయిన్లుగా నటిస్తున్నారు. సంక్రాంతి స్పెషల్ గా ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటి వరకూ విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, టైటిల్ టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'ది రేజ్ ఆఫ్ డాకు', 'చిన్ని' పాటలు కూడా ఆకట్టుకున్నాయి. రిలీజ్ డేట్ దగ్గర పడటంతో, ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్ లేటెస్టుగా "దబిడి దిబిడి" అనే మూడో పాటను వదిలారు. "ఉలాల్లా ఉలాల్లా.. నా మువ్వ గోపాలా.. కత్తులతోటే కాదు కంటి చూపుతోనే చంపాలా.. ఉలాల్లా ఉలాల్లా.. నా మువ్వ గోపాలా..కిస్సుల ఆటకొస్తా ప్లేసు టైం నువ్వే చెప్పాలా" అంటూ సాగిన ఈ పాట అభిమానులను విజువల్ ఫీస్ట్ అని చెప్పాలి. ఎందుకంటే బాలకృష్ణ సినిమాల్లోని పాపులర్ డైలాగ్స్ తో, భారీ స్థాయిలో ఈ మాస్ డ్యాన్స్ నంబర్ ను రూపొందించారు. 'దబిడి దిబిడి' అనేది కూడా ఆయన ఫేమస్ డైలాగ్ అనే సంగతి తెలిసిందే. ఇందులో బాలయ్య, బాలీవుడ్ భామ ఊర్వశి రౌతేలా కలిసి కాలు కదిపారు. ఫుల్ ఎనర్జీతో, అదిరిపోయే స్టెప్పులతో మాస్ ఆడియన్స్ ను మెప్పించారు. బాలకృష్ణ సినిమాలకు ఎస్. థమన్ ఏ రేంజ్ లో సంగీతం అందిస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీరి కలయికలో వచ్చే ప్రతి పాట సంగీత ప్రియులను రంజింపచేస్తుంది. ఇప్పుడు "దబిడి దిబిడి" సాంగ్ కూడా ఇన్స్టెంట్ హిట్ గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. సింగర్ వాగ్దేవి తన పవర్ ఫుల్ గాత్రంతో పాటను నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లింది. ఇక్కడ గీత రచయిత కాసర్ల శ్యామ్ సాహిత్యం గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. ట్యూన్ కి తగ్గట్టుగా బాలయ్య డైలాగ్ లతో క్యాచీ లిరిక్స్ అందించారు. "దబిడి దిబిడి" పాటకి శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనింగ్, విజయ్ కార్తీక్ కన్నన్ అద్భుతమైన విజువల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఓవరాల్ గా మ్యూజిక్, లిరిక్స్, డ్యాన్స్.. అన్నీ కలిపిన ఈ సాంగ్ నందమూరి ఫ్యాన్స్ తో పాటు, అన్ని వయసుల వారు కాలు కదిపేలా ఉంది. ముఖ్యంగా మాస్ ఆడియన్స్ కి ఇది నిజమైన మాస్ ట్రీట్ లా ఉందని చెప్పాలి. "జై బాలయ్య" తరహాలోనే ఈ పాట కూడా అభిమానుల హృదయాల్లో నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు. నందమూరి అభిమానులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్ ఉండేలా 'డాకు మహారాజ్' చిత్రాన్ని దర్శకుడు బాబీ కొల్లి రూపొందిస్తున్నారు. బాలకృష్ణను దృష్టిలోపెట్టుకొనే ఈ కథ రాసుకున్నారు. ఆయనకు తగిన ఎలివేషన్స్, యాక్షన్, ఎమోషన్స్ అన్నీ ఈ సినిమాలో ఉంటాయని చిత్ర బృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ లో బాలయ్య రెండు భిన్నమైన లుక్స్ లో కనిపించి అలరించారు. అయితే సినిమాలో మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఉన్నాయని చెబుతున్నారు. ఆయన డెకాయిట్‌గా మారే ఎలివేషన్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు. ఇందులో బాలీవుడ్ యాక్టర్ బాబీ డియోల్ విలన్ గా నటిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకరా స్టూడియోస్ సమర్పిస్తోన్న ఈ సినిమాకి నిరంజన్ దేవరమానే %ఁ% రూబెన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి కానుకగా 2025 జనవరి 12న ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో 'డాకు మహారాజ్' చిత్రం విడుదల కానుంది.

# అమ్మకు శ్రీలీల అమ్ములా!

తెలుగు హీరోయిన్ శ్రీలీల గురించి చెప్పాల్సిన పనిలేదు. స్టార్ లీగ్ లో చేరిన నెటి జనరేషన్ తొలి తెలుగు హీరోయిన్. అమ్మడు చాలా వేగంగా స్టార్ హీరోల చిత్రాలకు ప్రమోట్ అయింది. సాధారణంగా తెలుగు అమ్మాయిలకు అవకాశాలు ఇవ్వరు? అనే విమర్శ చాలా కాలంగా ఉంది. దాన్ని శ్రీలీల కాస్త బ్రేక్ చేసినట్లే కనిపిస్తుంది. ప్రస్తుతం అమ్మడి కెరీర్ కి తిరుగు లేదు. శ్రీలీల చలాకీ తనం....ట్యాలెంట్ తో ఇండస్ట్రీలో నెట్టుకొచ్చేస్తుంది. పుష్ప-2లో ఐటం పాటతో పాన్ ఇండియాలోనూ సంచలనం అయింది. ఈ పాట అమ్మడిని పాన్ ఇండియాలోనే ఎనలేని గుర్తింపును తీసుకొచ్చింది. మొదటి భాగంలో సమంత ఊపేస్తే రెండవ భాగంలో శ్రీలీల



ఊపేసింది. ఇకపై బాలీవుడ్ లో అవకాశాలు అందుకునే ఛాన్స్ ఉంది. ఇప్పటికే ఆ రకమైన ప్రయత్నాల్లో ఉంది. ఓ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారింది. అయినా శ్రీలీల చలాకీతనంతో మరెన్నో అవకాశాలకు ఛాన్స్ ఉంది. ఇక అమ్మడు ఇంట్లో కూడా ఎంతో చలాకీగా ఉంటుంది. అమ్మను ఆట పట్టించడంలో ముందుంటుంది. అమ్మకు శ్రీలీల అంటే మహా గారం లా ఉంది. శ్రీలీలను వాళ్లమ్మ ముద్దుగా అమ్ములు అని పిలుస్తుంది. సాధారణంగా ఇలాంటి పిలుపులు పల్లెటూళ్లలో వినిపిస్తుంటాయి. కానీ సిటీ కల్చర్ లో పెరిగిన అమ్మాయిని ఇలా పిలడంతో? వాళ్లెంత డౌన్ టూ ఎర్త్ అన్నది అద్దం పడుతుంది. తల్లీ-కూతురు డాక్టర్లు. బెంగుళూరులో సొంత ఆసుపత్రులున్నాయి. శ్రీలీల నటి కాకపోయి ఉంటే అమ్మలా డాక్టర్ అయ్యేది. ఇప్పటికే ఆ కోర్సు కూడా పూర్తి చేసింది. కానీ తల్లి కుమార్తెను హీరోయిన్ చేయాలని చిన్ననాటి ప్లాన్ చేసి నటనవైపు అడుగులు పడలా చూసారు. అందుకే శ్రీలీల అంత గొప్ప డాన్సర్ అయింది. నటిగానూ ఆమెకు తిరుగు లేదు.

# ఆ సూపర్ హిట్ ఐటెంపై తమన్నా అసంతృప్తి

మిల్కీ బ్యూటీ తమన్నా గత ఏడాదిలో జైలర్ సినిమాలో ఐటెం సాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వా కావాలయ్యా అంటూ సాగిన ఆ పాట ఏడాది అంతా సోషల్ మీడియాలో ఏ స్థాయిలో చక్కర్లు కొట్టిందో తెలిసిందే. ఆ పాటలో తమన్నా డాన్స్‌కి ప్రతి ఒక్కరు ఫిదా అయ్యారు. రజనీకాంత్ కంటే ఎక్కువగా ఆ పాటలో తమన్నాను ప్రేక్షకులు చూశారు. మిల్కీ బ్యూటీ తమన్నా స్థాయి ఇది అంటూ ఆ డాన్స్ వీడియోలను షేర్ చేస్తూ ఆమె ఫ్యాన్స్‌తో పాటు ఎంతో మంది సోషల్ మీడియా ద్వారా కామెంట్స్ చేయడం తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఆ పాట గురించిన ప్రస్థావన సోషల్ మీడియాలో వచ్చింది. జైలర్ సినిమా కోసం వా కావాలయ్యా పాట చేసిన తర్వాత బాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ స్త్రీ 2 లో ఆజ్ కీ రాత్ పాటలోనూ తమన్నా సందడి చేసింది. ఆ సినిమా భారీ విజయం సాధించడంలో తమన్నా కీలక పాత్ర పోషించింది. జైలర్, స్త్రీ 2 లో తమన్నా డాన్స్ సూపర్ అంటూ ఫ్యాన్స్‌తో పాటు ప్రతి ఒక్కరు అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉన్నారు. అయితే తమన్నా మాత్రం ఇటీవల ఒక చిట్ చాట్‌లో వా కావాలయ్యా పాటలో తన డాన్స్ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసింది. తాను ఆ పాట కోసం మరింతగా డాన్స్ చేసే అవకాశం ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల తన పూర్తి సామర్థ్యంను చూపించలేక



పోయాను అంది. జైలర్ సినిమాలో కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చింది తమన్నా అంటూ ఒక వైపు ప్రచారం జరుగుతూ ఉంటే మరో వైపు ఆమె మాత్రం ఇలా తన ప్రదర్శన పట్ల తానే అసంతృప్తి వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు తమన్నా ఆ సమయంలో తన స్థాయికి తగ్గట్లుగా ఎందుకు చేయలేదు అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలో తమన్నా అందాల ఆరబోత ఫోటోలు, వీడియోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూ ఉంటాయి. ఇప్పుడు తమన్నా కావాలయ్యా పాట గురించి చేసిన ప్రకటన పై అంతా చర్చించుకుంటూ ఉన్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా తెలుగు లో ఎంట్రీ ఇచ్చి దాదాపుగా రెండు దశాబ్దాలు అయింది. హ్యాపీ డేస్ తర్వాత ఒక్కసారిగా ఈ అమ్మడి క్రేజ్ మారిపోయింది. అందుకు తగ్గట్లుగానే ఈ అమ్మడి సినిమాలు చేస్తూ వచ్చింది. టాలీవుడ్ లో సీనియర్ స్టార్ హీరోల నుంచి యంగ్ స్టార్ హీరోల వరకు ఎందరితోనో సినిమాలు చేసిన ఈ అమ్మడు బాలీవుడ్, తమిళ్ సినిమాల్లోనూ నటించింది. కన్నడంతో పాటు మలయాళ సినిమాల ఇండస్ట్రీలో ఈమెకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరోయిన్‌గానే కాకుండా ఐటెం సాంగ్స్‌లో, మ్యూజిక్ వీడియోస్‌లోనూ తమన్నా నటించి మెప్పించింది.




చైనాలో మరో వైరస్ వ్యాప్తి చెందుతోందని, ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రుల ఎదుట క్యూ కట్టారంటూ వస్తోన్న వార్తలు మరోసారి ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. 2001లోనే గుర్తించిన హ్యూమన్ మెటానిమోవైరస్.. ప్రస్తుతం డ్రాగన్ దేశంలో వెలుగు చూస్తోన్న కేసులకు ఓ కారణం. చైనా ఉత్తర ప్రాంతంలో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఆసియా దేశాలు కూడా దీనిపై దృష్టిసారించాయి. ఇంతకీ దీని లక్షణాలు ఏంటి..? నివారణ ఎలా..? హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుంది. అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం.. చిన్నారులు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక శక్తి కలిగిన వ్యక్తులు దీనిబారిన పడే అవకాశాలు ఎక్కువ. **వ్యాప్తి ఇలా..** దగ్గు, తుమ్ము వల్ల వెలువడే తుంపర్లు. వైరస్ బారిన పడిన వ్యక్తులతో సన్నిహితంగా మెలగడం, కరచాలనం, తాకడం వంటి చర్యలు. వైరస్ వ్యాపించిన ప్రాంతాలను తాకిన తర్వాత నోరు, ముక్కు, కళ్లను తాకితే

**నివారణ ఇలా..** చిన్నపాటి ముందుజాగ్రత్త చర్యలతో ఈ వైరస్ దరిచేరకుండా చూసుకోవచ్చు. సబ్బుతో 20 సెకండ్ల పాటు తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. శుభ్రం చేసుకోని చేతులతో ముఖాన్ని తాకకుండా చూసుకోవాలి. వైరస్ బారినపడిన వ్యక్తులకు దూరం పాటించాలి. తరచూ తాకాల్సి వచ్చే పరిసరాలను శుభ్రం చేసుకోవాలి. వైరస్ బారినపడినవారు దగ్గు, తుమ్ము వచ్చేప్పుడు నోరు, ముక్కును కవర్ చేసుకోవాలి. ఆ తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలి.

ఆ వ్యక్తులు తమ వస్తువులను ఇతరులతో పంచుకోకుండా చూసుకోవాలి. లక్షణాలు కనిపిస్తున్నప్పుడు నలుగురిలోకి వెళ్లడం కంటే ఇంట్లో రెస్ట్ తీసుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. దానివల్ల వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని చెప్తున్నారు.




### దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని - అదే రోజు కశ్మీర్‌కు రైలు సేవలు ప్రారంభం!

హైదరాబాద్: ఆధునికీకరించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. రూ.430 కోట్ల వ్యయంతో నిర్మించిన దీన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 6వ తేదీన దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారు.

గత ఏడాది డిసెంబరు 28న ఈ టెర్మినల్‌ను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌ల చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగాయి. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది. కశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు చేపట్టిన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా ప్రాజెక్టులో కీలక పనులు గత నెలలో పూర్తయ్యాయి. దీంతో దేశంలో మిగతా ప్రాంతాల నుంచి కశ్మీర్ లోయకు రైళ్లు నడిపేందుకు మార్గం సుగమమైంది. ఈ అనుసంధాన ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రధాని మోదీతో ఈ నెల 6వ తేదీన ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా చర్లపల్లి టెర్మినల్‌ను కూడా ప్రారంభించాలని ప్రధానిని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌లు కొద్దిరోజుల క్రితం కలిసి కోరగా అందుకు ఆయన అంగీకరించారు. చర్లపల్లిలో జరిగే ప్రారంభోత్సవంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కశ్మీర్‌లో జరిగే కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొంటారు. కశ్మీర్‌కు ఓ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు, రెండు మెయిల్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించే అవకాశం ఉంది.

## 2050 నాటికి నగర జనాభా అవసరాలకు అనుగుణంగా భవిష్యత్ ప్రణాళికలు: సీఎం రేవంత్



హైదరాబాద్: 2050 నాటికి నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని జలమండలి అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బోర్డు ఛైర్మన్ హోదాలో తొలిసారి జలమండలి అధికారులతో సీఎం భేటీ అయ్యారు. గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుపై అధికారులతో చర్చించారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నుంచి నీటి సేకరణపై చర్చించారు. నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా 20 టీఎంసీలు తెచ్చుకునేలా మార్పులకు సీఎం ఆమోదం తెలిపారు. మంజీరా పైపులైన్‌కు అదనంగా ప్రత్యామ్నాయ పైపులైన్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

## మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు



హైదరాబాద్: మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు తెలంగాణ ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఫార్ములా -ఈ రేసింగ్ కేసులో ఈనెల 6న ఉదయం 10గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో దర్యాప్తును అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ముమ్మరం చేసింది. తెలంగాణ మున్సిపల్ శాఖ, ఫార్ములా-ఈ ఆపరేషన్స్ లిమిటెడ్(ఎఫ్ఈవో)ల మధ్య జరిగిన ఒప్పందం, అందులో చోటుచేసుకున్న ఉల్లంఘనలపై అధ్యయనం చేస్తోంది. ఈ క్రమంలోనే కేసు ఫిర్యాదుదారు ఎంఏయూడీ(పురపాలక శాఖ) ముఖ్య కార్యదర్శి దానకిశోర్ నుంచి పలు విడతలుగా సమాచారం సేకరించింది. ఏసీబీ.. ఇటీవల దానకిశోర్ నుంచి సుమారు ఏడు గంటలపాటు వివరాలను తీసుకుంది. వాటి ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్లే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.

**ప్రాథమిక దర్యాప్తులోనే ముందడుగు! :** ప్రాథమిక దర్యాప్తు క్రమంలో ఎంఏయూడీ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా... ఒప్పందంలో చోటుచేసుకున్న పలు కీలక ఉల్లంఘనలను ఏసీబీ ఇప్పటికే గుర్తించినట్లు తెలుస్తోంది. వీటి కేంద్రంగా నిందితులను విచారించే అవకాశం కనిపిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం అవి ఇలా ఉన్నాయి... హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేస్‌ను నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వానికి, లండన్ ఎఫ్ఈవోల మధ్య 2022 జనవరిలోనే ఒప్పందం కుదిరిందని, సంబంధిత దస్త్రం ఎంఏయూడీలో ఇప్పుడు అందుబాటులో లేదని గుర్తించినట్లు సమాచారం. అదే ఏడాది జులై 11న జారీ చేసిన జీవోలో మాత్రం లెటర్ ఆఫ్ ఇంటెంట్ గురించిన ప్రస్తావన ఉన్నట్లు వెల్లడైంది. రేసు నిర్వహణకు సంబంధించిన అధికారిక ఒప్పందంపై సంతకం చేయడానికి ముందే... ఆ జీవో ఆధారంగా మున్సిపల్ శాఖ అప్పటి మంత్రి కేటీఆర్ అధ్యక్షతన నాటి ప్రభుత్వం మేనేజింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తేలింది. 2022 అక్టోబరు 25న హైదరాబాద్‌లో 9, 10, 11, 12 సీజన్‌లలో ఫార్ములా-ఈ రేస్‌లను నిర్వహించేందుకు ఎంఏయూడీ, ఎఫ్ఈవో, ఏస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య త్రైపాక్షిక (మొదటి) ఒప్పందం కుదిరింది. దీన్ని కుదుర్చుకునేటప్పుడు, సీజన్-9 కోసం నిధులను ఖర్చు చేయడానికి అర్వింద్‌కుమార్... ప్రభుత్వంలోని కాంపిటెంట్ అథారిటీ నుంచి ఆమోదం తీసుకోలేదని, ప్రభుత్వమూ ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని గుర్తించినట్లు సమాచారం.

## కవితకు మంత్రి పొన్నం స్ట్రాంగ్ కౌంటర్



హైదరాబాద్, జనవరి 3: బీసీ డిక్లరేషన్‌కు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. బీసీల కోసం మాట్లాడుతున్నందుకు సోదరి కవితకి అభినందనలు అని అన్నారు. నాయకత్వం మధ్య గ్యాప్ ఉందనే కవిత మీటింగ్ పెట్టారని వ్యాఖ్యలు చేశారు. కవిత గతంలో బతుకమ్మ, తర్వాత జాగృతి ఇప్పుడు బీసీ నినాదం అందుకున్నారన్నారు. కొందరికి అధికారం మత్తు దిగి మస్తు గుర్తుకొస్తాయంటూ సెటైర్ విసిరారు. బీఆర్ఎస్ తమ పార్టీ పదవుల్లో బీసీలకు అవకాశమివ్వాలన్నారు. పార్టీ ఓనర్లలో తాను ఒకడిని అని ఈటెల రాజేందర్ అన్నందుకు మెడలు పట్టి బయటకి పంపారని విమర్శించారు. కవిత చేసే పనికి కొంత సంతోషం, కొంత బాధ కలుగుతోందన్నారు. పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్లు ఈరోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. బలహీన వర్గాలకు అవకాశం ఇవ్వకుండా తొక్కి పెట్టిన వాళ్లు ఈరోజు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మా పార్టీలో బలహీన వర్గాలకు అన్యాయమైతే పార్టీలో చర్చిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరిగితే మాట్లాడే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు. బీసీల శక్తి గుర్తించారు కాబట్టే కవిత బీసీ రాగం ఎత్తుకున్నారన్నారు. కవిత మీటింగ్‌కు జనాల కోసం బ్రతిమాలాడుతున్నారని సెటైరికల్ కామెంట్స్ చేశారు. ఎన్నికల సమయంలో తప్పా బీఆర్ఎస్ బీసీల కోసం ఏమైనా చేసిందా అని నిలదీశారు. ప్రగతి భవన్‌కు జ్యోతి రావ్ పూలే పేరు పెట్టుకున్నామని.. సావిత్రి భాయి పూలే జయంతిని మహిళా టీచర్ల దినంగా ప్రకటించామని తెలిపారు. కులగణన రిపోర్ట్ పబ్లిక్ డొమైన్‌లో పెడుతామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎవరెంతో వారికి అంత అని రాహుల్ గాంధీ చెప్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం బీసీలను ఉపయోగించుకుంటే ఊరుకోమని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## జిల్లాల పర్యటనకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే జిల్లాల పర్యటనకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్లాన్ చేసుకున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు జిల్లాల్లో మహేష్ కుమార్ గౌడ్ పర్యటించనున్నారు. ఆయా జిల్లాల్లో పార్టీ నేతలతో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశం నిర్వహించనున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ , కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా నేతలకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేయనున్నారు.

## ఆ విషయంపై చర్చకు రా కేటీఆర్ తేల్చుకుందాం.. షబ్బీర్ అలీ మాస్ సవాల్



హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలకు సిగ్గు, శరం ఏం లేదని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ విమర్శించారు. మాజీ మంత్రి కేటీఆర్ అవినీతిపై ఓపెన్ చాలెంజ్ చేశారు. ఉద్యమంలో కూడా కేటీఆర్ ఆస్తులు పెరిగాయని ఆరోపించారు. ఇవాళ(శుక్రవారం) గాంధీభవన్‌లో షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడుతూ... కేటీఆర్ ఇన్ని అస్తులు పెరగడానికి కారణమైన అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని చూపెట్టాలని అన్నారు. తాము ఎన్నికల కోసం ఆస్తులు అమ్ముతున్నామని. మీకు ఆస్తులు ఎలా పెరుగుతున్నాయని ప్రశ్నించారు. కేటీఆర్ ఐఏఎస్ అఫీసర్లను బకరాలను చేశారని మండిపడ్డారు. 2008లో రూ.4.32 కోట్ల అఫిడవిట్ చూపించిన కేటీఆర్ 2009లో రూ. 7.99 కోట్లు చూపించారని.. ఇన్ని ఆస్తులు ఎలా పెరిగాయని నిలదీశారు. 2023లో రూ. 50 కోట్లకు పైగా కేటీఆర్ ఆస్తులు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కవితల ఆస్తులు కూడా భారీగా పెరిగాయని ఆరోపించారు. గతంలో పార్లమెంటు జరిగే సమయంలో రేవంత్ రెడ్డిని అరెస్టు చేసేటప్పుడు రూల్స్ గుర్తుకు రాలేదా అని షబ్బీర్ అలీ ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ పార్టీకి ఆ అర్హత లేదు: ఎంపీ చామల కిరణ్ రెడ్డి :** ధర్నాచౌక్ దగ్గర బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధర్నాచేయడం చాలా వింతగా ఉందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తేసిన ధర్నాచౌక్ దగ్గరకు.. ఇప్పుడు కవిత వెళ్లి ధర్నా చేయడం నవ్వొస్తుందని ఎద్దేవా చేశారు. బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. బీసీల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదని ధ్వజమెత్తారు. కవిత, కేసీఆర్ ఫామ్‌హౌస్ ముందుకు వెళ్లి ధర్నా చేయాలని అన్నారు. పదేళ్ల పాలనలో బీసీలకు ఏం చేయనందుకు ఫార్మ్‌హౌస్ దగ్గర ధర్నా చేయాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో మీ కార్యవర్గంలో ఎవరైనా బీసీలు ఉన్నారా అని ప్రశ్నించారు. ఒక బీసీ మహేష్ గౌడ్‌ని పార్టీ అధ్యక్షులను కాంగ్రెస్ పార్టీ చేసిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ కులగణనను కూడా విమర్శించిదని మండిపడ్డారు. అలాంటి బీఆర్ఎస్ పార్టీకి ధర్నాలు చేసే నైతిక హక్కు లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కాస్మోటిక్ చార్జీలు పెంచాం: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హాస్టళ్లలో కాస్మోటిక్ చార్జీలు పెంచామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కొత్తగూడెం శ్రీ రామచంద్ర కళాశాలలో సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో భాగంగా రూ. 657 కోట్ల ఖర్చుతో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు కోసం రుద్రంపూర్ ప్రాంతంలో సింగరేణి, అటవీ, ప్రైవేట్ భూముల్లో ఫీజుబిలిటి సర్వే చేస్తున్నట్లు ప్రకటించారు.కొత్తగూడెంలో ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం కోసం కృషి చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ హాస్టలల్లో చదువుకున్న పేద విద్యార్థులకు కేసీఆర్ ప్రభుత్వం కనీసం భోజనం పెట్టలేదని ఆరోపించారు. ఈనాడు ఇందిరమ్మ రాజ్యంలో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## ఆ ఘనత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకే దక్కుతుంది: డిప్యూటీ సీఎం భట్టి..

సంగారెడ్డి: తెలంగాణలో 2030 నాటికి రెండు వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ సర్కార్ పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కందిలోని ఐఐటీ హైదరాబాద్ లో ఆస్ట్రేలియా-ఇండియా క్రిటికల్ మినరల్స్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండ్రోజుల వర్క్‌షాప్ కార్యక్రమంలో భట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్ షాప్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం అనంతరం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఖనిజ ఉత్పత్తుల కోసం ఐఐటీ హైదరాబాద్‌తో సింగరేణి ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. దేశ ప్రగతిలో ఐఐటీలది కీలక పాత్రని, మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఈ ఆధునిక దేవాలయాలైన ఐఐటీలకి అంకురార్పణ చేశారని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఐఐటీ హైదరాబాద్ విద్యాసంస్థ కాదని, ఆవిష్కరణలకు కేంద్ర బిందువని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఫ్లోటింగ్ సోలార్‌పై పెట్టుబడులు పెడుతామని, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణను మారుస్తామని ఆయన చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సంగారెడ్డికి ఐఐటీ వచ్చిందని భట్టి గుర్తు చేశారు. వైఎస్ రాజకీయ నేతే కాదు.. విజన్ ఉన్న గొప్ప నాయకుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు.

## క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణా కేంద్రం: డీజీపీ జితేందర్



హైదరాబాద్: యూసఫ్‌గూడలోని బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఇందులో 549 మంది కానిస్టేబుళు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీజీపీ జితేందర్ హాజరై మాట్లాడారు. ఇద్దరు అంతర్జాతీయ క్రీడాకారులు నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్ టీజీఎస్పీలో చేరారని చెప్పారు. వారి సేవలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. బాక్సింగ్, క్రికెట్‌పై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

## బాత్‌రూంలో వీడియోల చిత్రీకరణ ఘటన.. సీఎంఆర్ కళాశాలకు మూడురోజులు సెలవు



మేడ్చల్: మేడ్చల్ జిల్లా కండ్లకోయ సీఎంఆర్ కళాశాలలో వసతిగృహ స్నానాల గదిలో వీడియోలు చిత్రీకరించారంటూ విద్యార్థినులు చేసిన ఆరోపణలపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. హాస్టల్ వార్డెన్ సహా ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న వారి వేలిముద్రలను దర్యాప్తు బృందం సేకరించింది. మరోవైపు కళాశాలకు యాజమాన్యం మూడు రోజులపాటు సెలవులు ప్రకటించింది. వసతిగృహ స్నానాల గది వెంటిలేటర్ నుంచి తమను వీడియో తీశారంటూ మేడ్చల్ జిల్లా కండ్లకోయ సీఎంఆర్ కళాశాల ఐటీ క్యాంపస్ విద్యార్థినులు బుధవారం ఆందోళనకు దిగగా ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాలు, బీజేవైఎం నేతలు మద్దతు పలకడంతో గురువారం పరిస్థితి మరింత వేడెక్కింది. రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. యాజమాన్యానికి నోటీసు జారీ చేసింది. కమిషన్ కార్యదర్శి పద్మజారమణ వసతిగృహానికి వచ్చి విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com